Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

శనివారం, ఆగస్టు 09, 2025 | సంపుటి - 20 | సంచిక 310 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## మాటల్లేవు..
## మాట్లాడుకోవడాలులేవు
**భారత్‌పై సుంకాల విషయంలో ట్రంప్ మంకుపట్టు**



2

వాషింగ్టన్ : భారీ సుంకాలతో భారత్‌పై అన్యాయంగా కాలుదువ్వుతున్న ట్రంప్ తాజాగా మరో బాంబు పేల్చారు. భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండవని స్పష్టం చేశారు. దీంతో, భారత్– అమెరికా సంబంధాలు మునుపెన్నడూ చూడని స్థాయిలో పతనమై ఆందోళన రేకెత్తిస్తున్నాయి. భారత్‌పై సుంకాల విధింపు అనంతరం చర్చలు కొనసాగుతాయా? అన్న మీడియా ప్రశ్నకు ట్రంప్ ఉండవని తెలిపారు.

## 10న బిజెపిలోకి గువ్వల బాలరాజు
ఐదుగురు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు



హైదరాబాద్ : బిఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిజెపిలో చేరబోతున్నారు. ఈ విషయం ప్రకటించారు. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. 2లో



## తెలుగు రాష్ట్రాల్లో కొత్త లిక్కర్ స్కామ్
### ఆలస్యం, అలసత్వం మాటున భారీ కుట్ర?

**ప్రభుత్వాలు మారినా నాయకత్వాలు మారినా అదే అవినీతి..అదే లాలూచీ.. ఐనవారికి, అప్తులకు మేలు చేయడం కోసం కోట్ల రూపాయల ఆదాయాన్ని కూడా తెలుగు రాష్ట్రాలు వదులుకుంటున్నాయా..? భారీ రెవెన్యూ వచ్చే కొత్త మద్యం బ్రాండ్ల టెండర్ల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు, వాటి అధికారుల తీరు చూస్తుంటే అవే అనుమానాలు కలుగుతున్నాయి.. టెండర్లు పిలిచి ఆరు నెలలు అవుతున్నా ఇప్పటికీ అనుమతులు ఇవ్వకపోవడం వెనుక ఏదో మతలబు జరుగుతోందనీ.. కావాలనే ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇది కేవలం అలసత్వం కాదు.. కమీషన్ల కోసం, పెద్దల ప్రయోజనాల కోసం జరుగుతున్న కుట్ర అని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..**

హైదరాబాద్ : ఏపీలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే మద్యం పాలసీలో పారదర్శకత తీసుకొస్తారని, పాత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిదిద్దుతారని ప్రజలు ఆశించారు. కానీ, ఈ ఆశలు నిరాశగా మారాయి. కొత్త మద్యం బ్రాండ్ల కోసం టెండర్లు పిలిచి, అన్ని డాక్యుమెంట్లు సమర్పించినా ఇప్పటికీ అప్రూవల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. టెండర్ కమిటీ అన్ని సిఫార్సులు ఇచ్చేసినా, జీవో రిలీజ్ చేయకుండా ఫైళ్లను ముందుకు కదలనీయడం లేదు. గత ప్రభుత్వంలో నకిలీ మద్యం సరఫరా చేశారని ఆరోపణలు ఎదుర్కొన్నవారే ఇప్పుడు కొత్త ప్రభుత్వంలోనూ మద్యం సరఫరా చేస్తుండటం ఏంటి? గత ప్రభుత్వ హయాంలో లక్షల కేసులు అమ్మిన ఒక కంపెనీ ఈ ప్రభుత్వంలో కూడా లక్షల కేసులు అమ్ముతోంది..పార్టీ మారగానే పవిత్రులు అయిపోతారా.?? కొత్త సప్లయర్స్ కు అడ్డు పడి, వేరియంట్ల పేరుతో మళ్లీ పాత 2లో



## కమిషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం
**ప్రతి పథకం వెనకా కమిషన్ల బాగోతం**

**ఏ పనిచేసినా దోచుకేవడమే లక్ష్యం**

**బిఆర్ఎస్ ఎదురుదాడితో తప్పించుకునే ఎత్తుగడ**

**ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి పొంగులేటి విమర్శలు**

హనుమకొండ : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కమిషన్ల కోసమే కట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వారు ఏ పని చేసినా కమిషన్ల కోసమే చేశారని అన్నారు. తెలంగాణను అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ప్రతి పథకంలో కమిషన్ కోసమే నాటి ప్రభుత్వం పని చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. హన్మకొండ జిల్లా కేంద్రం బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను ఆపేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రచేస్తున్నాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. 2లో

## షాంఘై సదస్సుకు హాజరుకానున్న మోడీ
స్వాగతించిన చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి

న్యూఢిల్లీ : ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లనున్నారని వార్తలు వచ్చాయి. మిగతా 2లో

## బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం
ఓట్ల దొంగతనానికి ఇసి సహకారం

తన ఆరోపణలపై ఇసి ఎందుకు మౌనం

వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి

బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు



బెంగళూరు : ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని 2లో

## సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు
ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల

వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల బ్లాక్‌మెయిల్

ఎన్నికల్లో పట్టుబడ్డ వందలకోట్లు కెసిఆర్ ఖాతాలోకి

భార్యాభర్తల ఫోన్లుకూడా ట్యాప్ చేసిన దుర్మార్గులు

అత్యధికంగా నా ఫోన్ ట్యాప్ జరిగింది

ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష వేసినా తక్కువే

సిబిఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్

సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్

హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు డిమాండ్ చేశారు. ఇందులో లోతుగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. మిగతా 2లో



## భారత్ వ్యూహాత్మక అడుగులు
**రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అజిత్ ధోవల్ భేటీ**

**తాజా పరిణామాలపై ఇరు నేతలు చర్చ**

మాస్కో,ఆగస్ట్8 : గత కొన్ని రోజులుగా భారత్, రష్యా, అమెరికా మధ్య ఆసక్తికరమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. రష్యాతో భారత్ తన స్నేహాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. 3లో

## ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు
2

**చమురు కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీ చెల్లింపు**

**కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం**

## భారీవర్షాలతో నగరంలో ఇక్కట్లు
అప్రమత్తంగా ఉండాలి సిఎం ఆదేశం

పొంగి ప్రవహిస్తున్న మూసీ నది

ఈదులవాగులో కొట్టుకు పోతున్న కారును కాపాడిన స్థానికులు

హైదరాబాద్ : హైదరాబాద్‌లో గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జి పై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు- చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది.



హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఆవరిస్తున్న క్యుములోనింబస్
**భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక**

హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్లు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది. 2లో

## ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి ప్రారంభించాలి
**పనులు ఆగిపోవడంతో ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు**

**అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**



హైదరాబాద్ : ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు. శుక్రవారం నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు- చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ సిఫార్సు లతో తిరిగి పనులు మొదలుపెట్టాలి. మిగతా 3లో

## అలీబాబా 40 దొంగలు
కెసిఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది

అప్పులు చేసి దోచుకోవడంలో అందవేసిన చేయి

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి



3

## మాటల్లేవు.. మాట్లాడుకోవడాలు లేవు

విషయం కొలిక్కి వచ్చేంత వరకూ చర్చలు ఉండవు' అని స్పష్టం చేశారు. అంతకుముందు కూడా భారత్‌పై ట్రంప్ రెచ్చి పోయారు. రష్యాతో వాణిజ్యం నెరపే దేశాలపై మరిన్ని సుంకాలు ఉంటాయని హెచ్చరించారు. ఇతర దేశాలూ రష్యాతో వాణిజ్యం జరుపుతుండగా భారత్‌పైనే అక్కసు ఎందుకని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ట్రంప్ ఈ మేరకు సమాధానం ఇచ్చారు. భారతీయ ఉత్పత్తులపై అమెరికా ఇప్పటికే 25 శాతం సుంకం విధిస్తోంది. అదనంగా మరో 25 శాతం సుంకం విధిస్తూ ట్రంప్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. కొత్త సుంకాలు ఆగస్టు 27 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో, భారత్‌పై మొత్తం సుంకం 50 శాతానికి చేరుకుంది. అమెరికా చర్యలను భారత్ ఖండించింది. సుంకాల విధింపు అన్యాయం, నిర్హేతుకర, చట్టపరంగా సమర్థనీయం కాదని తేల్చి చెప్పింది. జాతీయ ప్రయోజనాల పరిరక్షణకు తాము అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఈ విషయంలో మా వైఖరిని ముందే స్పష్టం చేశాం. మా దిగుమతులన్నీ మార్కెట్ పరిస్థితులు, 1.4 బిలియన్‌ల భారతీయులకు ఇంధన భద్రత అందించడంపై ఆధారపడి ఉంటాయి' అని విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ కూడా ఘాటుగా స్పందించారు. గురువారం ఎమ్‌ఎస్ స్వామినాథన్ సెంటెనరీ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో ప్రసంగించిన ప్రధాని.. దేశ ప్రయోజనాల కోసం తాను వ్యక్తిగతంగా ఎంతటి మూల్యం చెల్లించుకునేందుకైనా సిద్ధమేనని అన్నారు. ప్రభుత్వానికి దేశ ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. రైతులు, మత్స్యకారులు, డెయిరీ రంగం విషయంలో భారత్ రాజీ పడదని స్పష్టం చేశారు.అమెరికా అనుసరిస్తున్న ద్వంద్వ ప్రమాణాలను కూడా భారత్ ఎండగట్టింది. రష్యా చమురును కొనుగోలు చేస్తున్న చైనా, టర్కీపై సుంకాలు ఎందుకు విధించట్లేదని ప్రశ్నించింది. ఇక చైనా ఉత్పత్తులపై గతంలో ప్రకటించిన 145 శాతం సుంకాలను అమెరికా ఇప్పటికీ అమలు చేయని విషయాన్ని కూడా భారత్ ప్రస్తావించింది.

## భారీవర్షాలతో నగరంలో ఇక్కట్లు

చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళ్తుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

## ఆవరిస్తున్న క్యుములోనింబస్



నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి. మరో ఐదు రోజులపాటు– తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

## ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది.ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దేశీయ ఎల్ పీజీ అమ్మకాలపై కంపెనీలకు కలిగే నష్టాలను భర్తీ చేయడానికి ఈ సబ్సిడీని ఉద్దేశించారు. దీనిని 12 భాగాలుగా చెల్లిస్తారు. 2025–26 ఆర్థికసంవత్సరానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 12 వేల సబ్సిడీని కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశం అంతటా శుభ్రమైన వంట గ్యాస్ నిరంతరం వినియోగించుకునేలా ప్రోత్సహించడం ద్వారా లబ్ధిదారులకు ఎల్ పిజి కనెక్షన్లు మరింత చౌకగా అందించడమే ఈ సబ్సిడీ లక్ష్యం.మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీలను అందించనున్నట్లు– పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వశాఖ తెలిపింది.ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసిఎల్) భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ( హెచ్ పిసిఎల్) మధ్య పంపిణీ చేస్తుంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ఈ నిర్ణయం లక్ష్యం అని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చమురు, గ్యాస్ రంగాల్లో అనిశ్చితి కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు– తెలిపారు.మధ్యతరగతికి వంటగ్యాస్ అందుబాటులో ఉండేలా చూడడం కోసం, రూ.30 వేల కోట్ల సబ్సిడీ ఆమోదించినట్లు– తెలిపారు అశ్విని వైష్ణవ్ .ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పిఎంయువై) 2016 మే లో ప్రారంభమైంది. భారతదేశం అంతటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వయోజన మహిళలకు డిపాజిట్ లు లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా సాగుతోంది. 2025 జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా 10కోట్ల 33 లక్షల ఎంఎంయువై కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన సబ్సిడీ కొనసాగించడం వల్ల వినియోగదారుడు ఎటు–వంటి డిపాజిట్ లేకుండానే ఎల్ పిజి కనెక్షన్ అందుకుంటాడు.అంతేకాదు, సిలెండర్, ప్రెషర్ రెగ్యులేటర్, సేఫ్టీ హోస్, డమెస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డు బుక్ లెట్ అందించడంతో పాటు– ఇన్‌స్టలేషన్ చార్జీలకోసం సెక్యూరిటీ– డిపాజిట్ ను కవర్ చేస్తుంది. ఉజ్వల 2.0 పథకం కింద వినియోగదారుడు తన మొదటి స్టవ్, రీఫిల్ కూడా ఉచితంగా పొందుతారు. అంతర్జాతీయ ఎల్ పిజి ధరల అస్థిరత నుంచి ఉజ్వల్ యోజన వినియోగదారులను కాపాడేందుకు, క్రమబద్ధీకరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2022 మేలో లక్ష సబ్సిడీని ప్రవేశపెట్టింది. సంవత్సరానికి 12 రీఫిల్ లకు 14.2 కిలోల సిలెండన్ ను కేవలం 200 రూపాయలకే అందిస్తుంది. ఈ సబ్సిడీని 2023 అక్టోబర్ లో రూ.300 కు పెంచారు.ఉజ్వల యోజన లబ్ధిదారులలో ఎల్ పిజి సగటు– తలసరి వినియోగం (పిసిసి) క్రమంగా పెరిగింది. 2019–20లో మూడు రీఫిళ్లనుంచి 2022.23లో సగటు– వినియోగం 3.68 కి పెరిగింది. 2024–25లో సుమారు 4.47 రీఫిల్ లకు చేరింది. ఇది వంటగ్యాస్ వినియోగంలో మహిళలు చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.

# తెలుగు రాష్ట్రాల్లో కొత్త లిక్కర్ స్కామ్

సప్లయర్‌లకే అన్నీ ఇస్తుండటం వెనుక అసలు రహస్యం ఏమిటి? ఈ ఆలస్యం వెనుక ముడుపుల బాగోతాలు, ఒత్తిళ్లు ఉన్నాయనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఎక్సైజ్ ఉన్నతాధికారుల ధోరణి వల్లే ఈ జాప్యం అనే ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి.. మద్యం విషయంలో ఎక్సైజ్ మినిస్టర్ పాత్ర కూడా నామమాత్రమే అని మొత్తం మరో కీలక మంత్రి కనుసన్నుల్లోనే నడుస్తున్నట్లు సమాచారం..నిన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో జరిగిన క్యాబినెట్ భేటీలో కూడా కొత్త బార్ లైసెన్స్ పాలసీ, మద్యం షాపుల్లో పర్మిట్ రూములపై నిర్ణయం తీసుకున్నారు కానీ కొత్త మద్యం బ్రాండ్ల గురించి కనీసం మాట మాత్రంగానైనా చర్చించలేదు.. సిట్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఈ ఆలస్యం అని అధికారులు చెబుతున్నా ..అస్మదీయులకు లాభం చేకూర్చేందుకే అని సప్లయర్స్ విమర్శిస్తున్నారు.. ఇక తెలంగాణలో మరీ దారుణం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ ఫిబ్రవరిలో కొత్త బ్రాండ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించినప్పుడు పరిశ్రమలో ఒక ఆశ కనిపించింది. ఏకంగా 92 కంపెనీలు 604 కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడానికి సిద్ధపడ్డాయి.. ఒక్కో కంపెనీ 20 లక్షల నుంచి 30 లక్షల రూపాయలు ప్రభుత్వానికి టెండర్ ఫీజు రూపంలో ముట్టజెప్పాయి.. ఇందులో 386 కొత్త బ్రాండ్లను కొత్త కంపెనీలు, 218 బ్రాండ్లను పాత కంపెనీలు సప్లై చేస్తామంటున్నాయి. కొత్త బ్రాండ్ల రాకతో పోటీ పెరిగి, ధరలు తగ్గి, వినియోగదారులకు లాభం చేకూరుతుంది. అంతేకాదు అమ్మకాలు పెరిగి ప్రభుత్వానికి భారీ ఎత్తున ఆదాయం సమకూరుతుంది.. కానీ, ప్రభుత్వం మాత్రం కొత్త బ్రాండులు వస్తున్నాయంటూ గత ఆరు నెలలుగా పత్రికల్లో పతాక శీర్షికల్లో ఊదర గొట్టి ఆ తర్వాత ముఖం చాటేసింది.. ఎక్సైజ్ ఆఫీసులో గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు పేరుకుపోయినా పరిశీలించే నాధుడు లేడు.. తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయంలోని ఒకరిద్దరు ఈ విషయంలో చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి భారీగా రెవెన్యూ నష్టం జరుగుతోంది. గతంలో బీర్ సరఫరాలో సమస్యలు తలెత్తడంతో రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం జరిగింది. యూనైటెడ్ బ్రూవరీస్ లిమిటెడ్ లాంటి ప్రముఖ కంపెనీకి రూ.658 కోట్లు, మొత్తం పరిశ్రమకు రూ.3,600 కోట్ల బకాయిలు ప్రభుత్వం చెల్లించకుండా ఆలస్యం చేయడం వల్ల సరఫరా ఆగిపోయి, డిమాండ్ ఉన్నా అమ్మకాలు లేక ఖజానాకు భారీ నష్టం జరిగింది.. ఇప్పుడూ అదే పరిస్థితి.. కమీషన్ల కోసం, కొద్దిమందికి లాభం చేకూర్చడం కోసం కొందరు చేస్తున్న కుట్ర వల్ల ప్రభుత్వం కోట్ల రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది..ఒకసారి మద్యం షాపులకు టెండర్లు పిలిచారు.. అయిపోయింది.. ఇప్పుడు మళ్లీ కొత్తగా మూడేళ్ల కోసం మద్యం షాపులకు టెండర్లు ఆహ్వానించబోతున్నట్లు సమాచారం..అయినా కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇచ్చే నాధుడు లేడు.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఒకే పరిస్థితి. ప్రభుత్వాలు మారినా.. పాత దొంగలకే మళ్లీ అవకాశం ఇస్తున్నారు. కోట్ల రూపాయల వ్యాపారంలో కొందరు అడ్డంగా దోచుకుంటున్నారనే విమర్శలు నిజమనిపించేలా వ్యవహరిస్తున్నారు. టెండర్లు పిలవడం, దరఖాస్తులు తీసుకోవడం, తర్వాత ఫైళ్లు కదపకుండా కూర్చోవడం.. ఇదంతా కొత్త సప్లయర్‌లను భయపెట్టి, పాతవారితో లాలూచీ పడటం కోసమేనా? చిన్న కంపెనీలకు ప్రోత్సాహం, మేకిన్ ఇండియా లాంటి నినాదాలు కేవలం ఎన్నికల ప్రసంగాలకు మాత్రమే పరిమితం అయ్యాయా? ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు తమ సొంత ప్రయోజనాలే తప్ప రాష్ట్ర ఆదాయం, నాణ్యమైన మద్యం సరఫరా, వినియోగదారుల ప్రయోజనాలు అవసరం లేదా? ఈ ఆటలో నష్టపోతుంది ప్రజలు.. లాభపడేది కేవలం పాత సప్లయర్లు, కార్పొరేట్ కంపెనీలు, కమీషన్ల రూపంలోనో, అయిన వారికి లబ్ది చేకూర్చాలనే లాలూచీ పడుతున్న కొందరు అధికారులు, నాయకులు మాత్రమే.. మరి ఈ దోపిడీపై ఎవరు జవాబు చెబుతారు? కొత్త బ్రాండులకు మోక్షం ఎప్పుడు కల్పిస్తారు.?

## షాంఘై సదస్సుకు హాజరుకానున్న మోడీ

ఇందుకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు– తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించిన బీజింగ్.. ప్రధాని మోదీ పర్యటనను స్వాగతించింది. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ద్వైపాక్షిక వార్షిక సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు.ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఎస్‌సీవో సభ్యదేశాలు సహా 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఇందుకు హాజరుకానున్నారని చెప్పారు. అయితే, ప్రధాని జపాన్, చైనా పర్యటనలకు సంబంధించి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్–చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ– అయ్యారు. తాజాగా మోడీ షాంఘై సదస్సులో పాల్గొనడానికి వెళ్లనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్‌ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటు–న్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్‌ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా కేంద్రంలో 592 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా దూసుకుపోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారిణి రహిమున్నీసాబేగానికి తొలి పట్టా అందించినట్లు– మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. 'పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు.. ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పాం. పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను కొందరికి మాత్రమే ఇచ్చింది. పదేళ్ల పాటు– ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు– జమ చేశాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వేల కోట్ల కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది. నిర్మాణంలో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టింది. బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని భాజపా ఆమోదించలేదు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న భాజపాకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.



## 10న బిజెపిలోకి గువ్వల బాలరాజు

ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామన్నారు. ఆ ఎమ్మెల్యేలు.. మా పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్‌తో రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలే కాదని.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఆగస్టు 10వ తేదీన బీజేపీలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరనున్నారని తెలిపారు. బీజేపీలో చేరికలకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇలా పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదన్నారు. అయితే ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఆయన అసహనానికి పరాకాష్టగా తెలంగాణ బీజేపీ చీఫ్ అభివర్ణించారు. బీసీల మీద ప్రేమ.. సీఎం రేవంత్ రెడ్డికి కొత్తగా వచ్చిందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే అచ్చంపేట బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో భేటీ అయ్యారు. తార్నాకలోని నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఇటీవలే గువ్వల బాలరాజు భారత రాష్ట్ర సమితికి రాజీనామా చేశారు. ఈ నెల 11న ఆయన భాజపాలో చేరనున్నారు.

## బిజెపికి తొత్తుగా ఎన్నికల సంఘం

ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు– ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొ–చ్చు, కానీ తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు– దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్‌గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ ఫుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్‌గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు– నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్



పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు

గతంలో భారత రాష్ట్ర సమితి దోచుకుందని, ఇప్పుడు కాంగ్రెస్ దోచుకుంటోందని దుయ్యబట్టారు. సిబిఐ విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు. నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. గత ప్రభుత్వంలో సాధారణ ఫోన్ కాల్స్ మాట్లాడేందుకు భయపడి వాట్సప్ కాల్స్ మాట్లాడేవాళ్లు. అప్పటి భారత రాష్ట్ర సమితి మంత్రులు, ఎమ్మెల్యేల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని బండి అన్నారు. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు ట్యాప్ చేశారు. వారినీ విచారణకు పిలవాలి. ఎస్ఐబీని సొంత అవసరాలకు అడ్డాగా కేటీఆర్ మార్చారు.నాయకులు, లాయర్లు, వ్యాపారులు, సినీ నటులు,ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీ–ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా అనేక లావాదేవీలకు సంబంధించి లబ్ధి పొందారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని బండి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు– పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలామంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు– సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు– దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు– అవుతాయి. రూ. వేల కోట్లు– అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు– ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదని బండి సంజయ్ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులు అందించిన వివరాలు చూసి తాను షాక్ అయినట్లు– మంత్రి బండి సంజయ్ తెలిపారు. తన ఫోన్, తన కుటుంబ సభ్యులతోపాటు– తన ఓఎస్డీ, వ్యక్తిగత సిబ్బంది ఫోన్ ట్యాప్ అయినట్లు– చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తన ఫోన్ ట్యాపింగ్ అవుతున్నట్లు– తాను గుర్తించానని ఆయన స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో తన ఫోన్లు ఎక్కువ సార్లు ట్యాప్ చేశారని పేర్కొన్నారు. మావోయిస్టుల జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాప్ చేశారని మండిపడ్డారు. పార్టీ కార్యకర్తల నుంచి రాష్ట్ర స్థాయి నాయకులతో తాను మాట్లాడిన అన్ని కాల్స్ ట్యాప్ చేశారని వివరించారు. టీ–బీజేపీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన చుట్టూ నిఘా పెట్టారని విమర్శించారు. వావివరసలు లేకుండా ఫోన్లు ట్యాప్ చేశారంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని కుండ బద్దలు కొట్టారు. కేసీఆర్ పాలనలో సామాన్యులు సైతం ఫోన్లు మాట్లాడ లేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో భార్యాభర్తల ఫోన్ సంభాషణలూ కూడా విన్నారంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలకంగా వ్యవహరించిన ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష విధించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా బండి సంజయ్ డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులను రేవంత్ ప్రభుత్వం కాపాడుతోందని ఆరోపించారు. వ్యాపారస్తుల ఫోన్లు ట్యాప్ చేసి బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో దొరికిన నగదంతా కేసీఆర్ ఖాతాల్లోకి వెళ్లాయని ఆరోపించారు. ఈ కేసును ఇంకా ఎంత కాలం సాగదీస్తారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినైనా అరెస్టు చేశారా? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సీబీఐతో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయంలో అధికారుల విచారణకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు– బండి సంజయ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షిగా బండి సంజయ్ అందించిన వాంగ్మూలాన్ని వారు రికార్డు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను సిట్ అధికారులకు బండి సంజయ్ అందజేశారు. తెలంగాణ బీజేపీ చీఫ్ అయినప్పటి నుంచి మీ ఫోన్ ట్యాప్ అయినట్లు– బండి సంజయ్‌కు సిట్ అధికారులు వివరించారు. అలాగే ఎవరితో ఎంత సేపు మాట్లాడారన్న డేటాను సైతం ఆయనకు వారు సాక్ష్యాలతో సహా చూపించారు. మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో రాజకీయ నేతలతో బండి సంజయ్ మాట్లాడిన డేటాకు సంబంధించిన వివరాలను ఆయనకు సిట్ అధికారులు ఈ సందర్భంగా అందజేశారు.

# క్రీడా పాఠశాలలు పతకాలు సాధించే కర్మగారాలుగా మారాలి

**విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంలో శిక్షణ**

**- ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థి ఫలితాలపై సమీక్ష**

**స్పోర్ట్స్ స్కూళ్ళు, అకాడమీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు**

**క్రీడలపై సమీక్ష సమావేశం నిర్వహించిన మంత్రి వాకిటి శ్రీహరి**



హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలలు, అకాడమీలు పతకాలు సాధించే కర్మగారాలుగా మారాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. ఈరోజు ఎల్బీ స్టేడియంలో చైర్మన్ శివసేనారెడ్డి తో కలిసి ఆయనరాష్ట్రంలోని స్పోర్ట్స్ స్కూళ్లు, అకాడమీల పనితీరు, సవాళ్లు, భవిష్యత్ ప్రణాళికపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ,2025%-%26 విద్యా సంవత్సరానికి పారదర్శకంగా, ప్రతిభ ఆధారంగా విద్యార్థుల ఎంపిక జరగాలనిహకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు కరీంనగర్, ఆదిలాబాద్ స్కూళ్లలో ఆధునిక క్రీడా శిక్షణ, విద్యలో మెరుగుదల సాధించాలని అధికారులకు సూచించారు. హకీంపేట్‌లో తక్షణ మరమ్మతులు, అన్ని స్కూళ్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ అథారిటీ అకాడమీల పనితీరు మెరుగుపరిచి విద్యార్థి క్రీడాకారుల్లో స్ఫూర్తిని కలిగించే కార్యక్రమం నిర్వహించాలని కోరారు స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీ లలో త్రైమాసికంగా బ్యాటరీ టెస్టులు నిర్వహించి , కంప్యూటరైజ్డ్ రిపోర్టులు తయారుచేసి విద్యార్థుల తల్లిదండ్రులకు పంపించే విధంగా ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ప్రతిభ ఆధారంగా విద్యార్థుల వర్గీకరణ చేసి క్రీడా ప్రతిభ లేని వారిని ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లకు బదిలీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. స్పోర్ట్స్ స్కూల్లో పనిచేసే అధికారులు సిబ్బంది కోర్సులు అందరూ విద్యార్థుల సంక్షేమం కోసం తమ పిల్లలుగా చూసుకోవాలని వారికి ఇబ్బందులు రాకుండా వారి యోగక్షేమాలు చూడాల్సిన బాధ్యత తీసుకోవాలని కోరారు. ప్రేరణాత్మక తరగతులు, వ్యక్తిత్వ వికాస అంశాల్లో శిక్షణ యోగ శిక్షణ తప్పనిసరి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. తెలంగాణ విద్యార్థిని విద్యార్థులు సాధించిన విజయాలను ప్రదర్శించేందుకు ప్రతి స్పోర్ట్స్ స్కూల్ అకాడమీల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కొరకు విజిటర్స్ హాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఎల్.బి. స్టేడియంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్ నిర్మాణం చేసి అన్ని అకాడమీలను స్పోర్ట్స్ స్కూల్ లలో ఏర్పాటు చేసే సీసీ కెమెరాలను ఈ కాన్ఫరెన్స్ వాళ్లకు అనుసంధించాలని తెలిపారు. క్రమం తప్పకుండా క్రీడా శాఖలోని అన్ని విభాగాలపై నిరంతరం సమీక్షలు చేస్తామని తెలిపారు. స్పోర్ట్స్ స్కూల్లో అకాడమీల పనితీరు మెరుగుపరచడమే కాకుండా అన్ని అంశాలపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు అందరి అభిప్రాయాలు తీసుకుంటూ సమగ్ర క్రీడాభివృద్ధి కోసం కృషి చేస్తామని ఆయన తెలిపారు. విధుల్లో అలసత్వం వహించే ఎవరిని కూడా ఉపేక్షించమని మంత్రి శ్రీహరి తెలిపారు ఈ కార్యక్రమంలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె. శివసేన రెడ్డి, తో పాటు హకింపేట స్పోర్ట్స్ స్కూల్ ప్రత్యేక అధికారి టి. మమత, డిప్యూటీ డైరెక్టర్లు జి చంద్ర రెడ్డి జి. రవీందర్, డా. రవి శంకర్ పల్లెల, , ఎస్.ఎం. బాషా, జి. అశోక్ కుమార్, పి. సందీప్ కుమార్, సురేష్ కాలేరు తదితరులు ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు.

## ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి ప్రారంభించాలి

ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మీ పనికే నిలిచిపోవడం దురదృష్టకరం అన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి కానందున ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు- ఖర్చవుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీఆర్ఐ సర్వేతో భూగర్భం కి.మీ దిగువ వరకు మ్యాపింగ్ చేయొచ్చన్నారు. కచ్చితమైన ప్రణాళిక కోసం లైడార్ సర్వే కూడా చేస్తాం. నాణ్యతలో రాజీపడకుండా మంత్రివర్గం ఆమోదించిన అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టాలని మంత్రి తెలిపారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ సొరంగానికి హెలికాప్టర్‌తో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.2.36 కోట్లతో నామినేషన్ పద్ధతిన ఎన్జీఆర్ఐకి పనులు అప్పగించింది. ఎస్ఎల్‌బిసి సొరంగంలో జరిగిన ప్రమాదం తర్వాత అక్కడ పనులు ఆగిపోయాయి. దీంతో ఆ పనులను పునః ప్రారంభించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.సొరంగంలో ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ- సిఫార్సులతో పనులు తిరిగి మొదలు పెట్టాలని ఉత్తమ్ అన్నారు. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మి పనికే ఆగిపోవడం దురదృష్టకరం. ఎస్ఎల్‌బిసి పూర్తి కాకపోవడంతో ఎత్తిపోతలకు రూ.750 కోట్లు- ఖర్చవుతోంది. అందుకే అత్యాధునిక సాంకేతికతతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

## భారత్ వ్యూహాత్మక అడుగులు

ఇదే సమయంలో అమెరికా నుంచి వస్తున్న ఒత్తిడిని కూడా ఎదుర్కొంటోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, మన జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో మాస్కోలో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడింది. ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ నుంచి వచ్చే ఉత్పత్తులపై 25 శాతం అదనపు సుంకం విధిస్తూ ఆదేశాలు జారీ చేసిన తర్వాత ఈ మీటింగ్ జరిగింది. దీంతో భారత్ ఉత్పత్తులపై మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఎందుకంటే, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం. ఈ సుంకాల విషయంలో అమెరికా ఒక షరతు కూడా పెట్టింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇప్పుడు నాలుగో ఏడాదిలోకి అడుగుపెడుతోంది. ఈ యుద్ధాన్ని శుక్రవారం నాటికి రష్యా ఆపకపోతే రష్యా చమురు కొనే దేశాలపై ఆంక్షలు డబుల్ చేస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ కొత్త సుంకాలు రెండు దశల్లో అమల్లోకి వస్తాయి. మొదటి 25 శాతం ఆగస్టు 7 నుంచి, మరో 25 శాతం 21 రోజుల తర్వాత. అయితే, చర్చల ద్వారా ఏదైనా మార్పు వస్తే మాత్రం ఈ పరిస్థితి మారే అవకాశం ఉంది. అమెరికా ఈ నిర్ణయంతో భారత్-అమెరికా మధ్య ఉద్రిక్తత మరింత పెరిగింది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్, ఈ సుంకాలను అన్యాయం, ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. భారత ఆర్థిక స్వాతంత్రాన్ని కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉంటే, అమెరికా కూడా రష్యా నుంచి యురేనియం, పల్లాడియం, ఎరువులు దిగుమతి చేసుకుంటు-ందని, దీన్ని డబుల్ స్టాండర్డ్స్ అనకూడదా? అని విమర్శించారు.మరోవైపు అజిత్ దోవల్, రష్యా సెక్యూరిటీ- కౌన్సిల్ సెక్రటరీ సెర్గీ షోయిగుతో సమావేశంలో పుతిన్ ఈ ఏడాది భారత్‌కు రానున్నారని, తేదీ త్వరలో ఖరారు అవుతుందన్నారు. ఈ సందర్శన గురించి భారత్ చాలా ఉత్సాహంగా ఉందని, గతంలో జరిగిన భారత్-రష్యా సమావేశాలు రెండు దేశాల సంబంధాల్లో కీలకమైనవని దోవల్ అన్నారు. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం.

## ఫసల్‌బీమా యోజనతో రైతులకు అండ

**ప్రభుత్వ నిర్ణయంతో రైతుల్లో ఆనందం**

హైదరాబాద్,ఆగస్ట్8 : కేంద్రం తీసుకుని వచ్చిన ఫసల్ బీమాలో చేరాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో రైతులకు మేలు జరుతుందని కూడా తెలిపింది. రైతులను ఆదుకునే క్రమంలో పసల్ బీమా యోజనలో చేరడం, రైతల కిస్తీకూడా ప్రభుత్వమే భరిస్తుందిన సిఎం, డిప్యూటి సిఎంలు కూడా వెల్లడించారు. రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం రైతాంగానికి వెన్నుదన్నుగా నిలుస్తుంది..ప్రకృతి కరుణించక అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతూ... ఇక వ్యవసాయం వద్దు అనుకునే రైతన్నకు ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన అండగా నిలుస్తోంది. దేశానికి వెన్నుముక రైతు , రైతు పంటలు పండిస్తేనే ప్రజలకు ఐదు వేళ్ళు నోట్లోకి వేలుతాయి. అలాంటి రైతు తాము పండించిన పంటకు అకాల వర్షాలతోనో అనుకోని వైపరీత్యాలతో పంట నష్టపోతే అ రైతు పరిస్తితి ఏంటి అనుకునే తరుణంలో ఫసల్ బీమాయోజన వారికి ఆసరాగా నిలిచింది. పంట నష్టపోయిన రైతన్నను అమ్మలా అదుకుంటూతుంది. వ్యవసాయం దండుగ అని గతంలో అన్న రైతుకు వ్యవసాయం పండుగా అనేలా ప్రతి రైతు ప్రకృతి వైపరీత్యాలకు బెదరకుండా తమ భూమిని సాగు చేసి వ్యవసాయాన్ని చేసే దైర్యాన్ని ఇస్తుంది.. ఫసల్ బీమా యోజన పథకం. రైతు తాము పండించే పంట పెట్టుబడి ఎకరాకు అందులో రెండు శాతం ఫసల్ బీమా పథకం ప్రీమియం కడితే చాలు వరిపంటకు ఎకరాకు 34 వేల బీమా ఉండగా అందులో రెండు శాతం అంటే 680 రూపాయలు ప్రీమియం కడితే చాలు అలగే మొక్క జొన్న ... వేరుశనిగే పంటలకు రెండు శాతం ఉండగా పసుపు పంటకు మాత్రం 3.5 శాతం ప్రీమియం చెల్లించాల్సి ఉంది.. దీంతో రైతుకు ఎదురయ్యే ఇబ్బందులు తెగుళ్ళు .. వడగళ్ళ.. పిడుగులు.. అకాల వర్షాలతో పంట నష్టపోతే ఆ రైతుకు ఫసల్ బీమా రక్షణగా నిలుస్తుంది.. వీటితో పాటు ఇందులోనే వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం ద్వారా పత్తి పంటతో పాటు మిర్చిపంటకు కూడా రైతు 5 శాతం ప్రీమియం చెల్లిస్తే వాతావరణం అనుకులించ కున్న వేసిన విత్తనం మొలకేత్తకపోయిన రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పంట పెట్టుబడి నష్ట పోకుండా ఫసల్ బీమా పథకం అండగా నిలుస్తుంది. పంటకోత తర్వాత జరిగే నష్టాలకూ బీమా వర్తిస్తుంది. పంటనష్టం జరిగిందని తెలియగానే బీమా మొత్తంలో 25 శాతం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేస్తారు.

# అలీబాబా 40 దొంగలు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు- కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు- సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# బిజెపితో బిఆర్ఎస్ పొత్తు సాధ్యమేనా?

**బిసి బిల్లుపై ఇరుపార్టీలకు కాంగ్రెస్ సవాల్**

**తాజా రాజకీయాలపై సర్వత్రా ఆసక్తి**

హైదరాబాద్,ఆగస్ట్8 : పదేళ్లపాటు అధికారం అనుభవించి, ఆర్థికంగా బలపడి, ఇష్టారాజ్యంగా పాలన చేసిన బిఆర్ఎస్‌కు ప్రస్తుత పరిస్థితులు మింగుడు పడడం లేదు. వరుసగా మూడోసారి అధికారం తమదే అనుకున్న తరుణంలో పరిస్థితులు తలకిందులు అయ్యాయి. ఈ ఉక్కపోతను కెసిఆర్ కుటంబం భరించకోలేక పోతున్నది. అందుకే తరవాత తమదే అధికారం అని మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. రేవంత్ సర్కార్‌ను విధానాల పరంగా కాకుండా వ్యక్తిగతంగా విమరశలకు దిగుతున్నారు. ఓ వైపు విచారణ, మరోవైపు విమర్శలు, ఇంకోవైపు కూతురు కవిత సొంత రాజకీయాలు వంటి విషయాలు కెసిఆర్‌ను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అందుకే దీనిని నుంచి బయటపడే మార్గాల గురించి ఆలోచన చేస్తున్నట్లు చర్చ సాగుతోంది. కాంగ్రెస్ ప్రధానంగా ఈ రెండు పార్టీల మధ్య అవగాహన ఉందన్న ప్రచారం జోరు పెంచింది. ప్రధానంగా రేవంత్ సిఎం కావడాన్ని బిఆర్ఎస్ తట్టుకోలేక పోతోంది.ఈ క్రమంలో దీనికి చెక్ పెట్టాలన్న ఆలోచన నుంచే బిజెపికి చేరువ కావాలన్న సూత్రం పుట్టిందన్న ప్రచారం సాగుతోంది. బిసి రిజర్వేషన్ల విషయంలో బిఆర్ఎస్, బిజెపి రెండూ ఒక్కటేనని కాంగ్రెస్ విమర్శిస్తోంది. బిజెపికి దగ్గర కావడానికి బిఆర్ఎస్ యత్నించిందని కవిత కూడా సంచలన ఆరోపణలు చేసింది. ప్రధానంగా రెండు విషయాలపై బిఆర్ఎస్‌లో అంతర్గతంగా చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ బిఆర్ఎస్ అంటే కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావు లాంటి వారి మధ్యనే అని గుర్తించాలి. ఇకపోతే ఎమ్మెల్యేల అనర్హతపై బిఆర్ఎస్ పట్టుబడుతోంది. మూడునెలల సమయం ఇవ్వడంతో దీనిని గట్టిగా ప్రచారం చేస్తోంది. ప్రస్తుత రాజకీయాలను మలుపు తిప్పాలన్నదే వారి ఎత్తుగడగా ఉంది. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు. ఐదుగురిలో కేశవరావు జారుకుని రాజీనామా చేశారు. బిజెపికి కూడా రాజ్యసభలో బలం అవసరం. నలుగురు రావడం అంటే తక్కువేమీ కాదు. అందుకే బిఆర్ఎస్, బిజెపిల విలీనంపై ఈ మధ్య పుంఖానుపుంఖాలుగా వార్తలు వస్తున్నాయి. ఇందులో ప్రధానంగా బిఆర్ఎస్ విలీనం అయితే కెసిఆర్ కేంద్రమంత్రిగా ఢిల్లీకి వెళ్లడం.. ఒప్పందంగా ఉండొచ్చు. తదుపరి కాలంలో తెలంగాణలోనూ షిండేలను సృష్టించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం అన్నది కావచ్చు. ఇవన్నీ కూడా ఊహాజనితమే అయినా ..వీటిచుట్టే ప్రచారం సాగుతోంది. బిఆర్ఎస్, బిజెపి ఎమ్మెల్యేలు కలిశాక వారి బలం ఇప్పుడున్న పరిస్థితుల్లో 36కు చేరుకుంటుంది. ఓ పదిమంది కాంగ్రెస్‌లో చేరారు. వారిని కూడా వెనక్కి రప్పించడం జరగవచ్చు. లేదా కోర్టు ద్వారా ఒకరిద్దరి పై వేటు వేయించి దారికి తెచ్చుకునే ప్రయత్నాలు కూడా సాగుతున్నాయి.అందుకే తెలంగాణ రాజకీయాలు ఊహించని మలుపులు తిరుగుతున్నాయనే భ్రమను కలిపిస్తున్నాయి. భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీల మధ్య విలీన చర్చలు జరుగుతున్నాయని విస్తృత ప్రచారం ప్రారంభమయింది. గత నాలుగైదు నెలలుగా ఈ తరహా ప్రచారం అంతర్గతంగా సాగుతోంది.కానీ ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ప్రచారం మరింత ఊపందుకుంది. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాత్రం ఖండించారు. ఓ ట్వీట్ ద్వారా వీలైనంత బలంగా విలీనం ప్రచారం కుట్ర పూరిత ప్రచారం అన్నారు కానీ.. ఆ వాదనలో బలం ఉందని రాజకీయవర్గాలు భావించడం లేదు. బీఆర్ఎస్ పార్టీ విలీనంపై జరుగుతున్న ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి బీఆర్ఎస్ వ్యూహాత్మక నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. అందుకే ఎక్కువ మంది విలీన చర్చలు నిజమేనని అనుకుంటున్నారు. గతంలో కెటిఆర్, హరీష్ రావుల ఢిల్లీ టూర్‌పై కాంగ్రెస్ పార్టీ సెటైర్లు వేసింది. రేవంత్ రెడ్డి అయితే పార్టీని తాకట్టు పెట్టడానికి వెళ్లారని విమర్శించారు. బీజేపీ నేతల కోసం పడిగాపులు పడుతున్నారని మండిపడ్డారు. బీజేపీతో కలిసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శలు గుప్పించారు. అయితే ఈ విషయంలో బీఆర్ఎస్ వైపు నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇదే క్రమంలో సుప్రీం తీర్పుకు అనుగుణంగా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయనిపుణులతో చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి నిప్పులేనిదే పొగరాదు. ఎక్కడో ఒకచోట ఏదో ఒక సందర్భం లేకుండా ఇలాంటి వార్తలు రావు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఎలాంటి పొత్తు చర్చలు జరగకపోతే.. ఈ విషయాన్ని ఖండించడానికి రెండు పార్టీలు ఎందుకు తటపటాయిస్తున్నాయన్నది రాజకీయవర్గాల నుంచి వస్తున్న మొదటి ప్రశ్న. నిర్మోహమాటంగా ఖండించడానికి బీఆర్ఎస్ ముఖ్య నేతలు సిద్ధంగా లేరు. బీజేపీతో పొత్తు లేదా విలీనం అంటూ జరుగుతున్న ప్రచారంపై స్పందించడానికి నిరాకరిస్తున్నారు. తెలంగాణ కోసం రాజీలేని పోరాటం చేస్తామని కెటిఆర్ చెబుతున్నారు. తెలంగాణ ఉన్నంతవరకు గులాబీ జెండా ఎగురుతుందన్నారు. కాంగ్రెస్‌కు బిజెపి సహకరిస్తోందని కూడా ఎదురుదాడి చేస్తున్నారు. విలీనం లేదా పొత్తు కుదిరితే బీఆర్ఎస్ పార్టీకి ఉన్న క్యాడర్ బలం..బీజేపీకి కలసి వస్తుందని.. కింది స్థాయి వరకూ పార్టీ నిర్మాణం ఏర్పడుతుందని ..ఇతర సీనియర్ నేతలు పాజిటివ్‌గా స్పందిస్తున్నారని అంటున్నారు. అయితే బీఆర్ఎస్ క్యాడర్ మాత్రం.. అలాంటి పరిస్థితి రాదని.. కేసీఆర్ తన పార్టీని ఇతర పార్టీల్లో కలిపేంత నిర్ణయం తీసుకోరని, పొత్తులకు కూడా దూమని అంటున్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే.

## మెడిసిటీ కళాశాలలో గంజాయి కేసు

**విద్యార్థులు గంజాయి అమ్ముతున్నట్లు గుర్తింపు**

మేడ్చల్,ఆగస్ట్ 8 : వైద్య విద్యార్థులు కూడా గంజాయి మత్తులో పడ్డారు. ఏకంగా సీనియర్లు అమ్మడం, జూనియర్లు దానికి అలవాటు పడడం జరిగింది. మేడ్చల్ మెడిసిటీ- మెడికల్ కళాశాలలో గంజాయి కేసులో కొత్తకోణం బయటపడింది. మూడేళ్లుగా కాలేజీలో చదువుతున్న వైద్య విద్యార్థులు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు- విచారణలో తేలిందని హైదరాబాద్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌పై ఈగల్ పోలీసులు నిర్వహిస్తున్న ఆపరేషన్‌లో మెడిసిటీ- వైద్య విద్యార్థులు గంజాయి తీసుకున్నట్లు- గురువారం పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ టెస్టులో గంజాయి పాజిటివ్ వచ్చిన పలువురు విద్యార్థుల్ని డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఏఎన్‌బీ అధికారులకు మరిన్ని విషయాలు తెలిశాయి. సీనియర్ విద్యార్థులే జూనియర్లకు గంజాయి అలవాటు- చేశారని, వారే వాటిని విక్రయించినట్లు- గుర్తించారు. వైద్య విద్యార్థులకు గంజాయి విక్రయించిన డ్రగ్ పెడ్లర్ బొల్లారానికి చెందిన హరాఫత్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు- తెలిపారు. నిందితుడు అలీఖాన్ బీదర్‌కు చెందిన జరీనా బాను నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. వైద్య విద్యార్థులకు అమ్ముతున్నట్లు- పోలీసులు చెప్పారు.

## సృష్టి కేసులో ఇద్దరు కెజిహెచ్ డాక్టర్లు

**తవ్వినకొద్దీ బయట పడుతున్న అక్రమాలు**

హైదరాబాద్,ఆగస్ట్ 8 : 'సృష్టి' ఫెర్టిలిటీకేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుక రాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యుల్లత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ- ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారని ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ అరెస్టులపై తనకు వివరాలు తెలియవని తెలిపారు. డాక్టర్ వాసుపల్లి రవి కుమార్ గత మూడు రోజులుగా సెలవులో ఉన్నట్లు- సమాచారం. మరో వైపు, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 28కి చేరింది. దర్యాప్తులో బయటపడ్డ వివరాల ప్రకారం, సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత ఇప్పటి వరకు సుమారు 50 మంది బాధితుల వద్ద నుంచి రూ.20 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో కీలక నిందితురాలు సంతోషి ఏజెంట్ల ద్వారా 18 మంది శిశువులను సేకరించినట్లు- తేలింది. ముఖ్యంగా గిరిజన మహిళలను ప్రలోభపెట్టి వారి నుంచి శిశువులను కొనుగోలు చేసి, తమ క్లయింట్లకు ఒక్కో శిశువును రూ.50 లక్షలకు విక్రయించినట్లు- వెల్లడైంది. మొత్తం 80 మంది పిల్లలను అమ్మిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తల్లులను గుర్తించి శిశువులను తిరిగి వారికి అప్పగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తున్నారు.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

**నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం**

న్యూఢిల్లీ,ఆగస్ట్8 : అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికిఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈనెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటున్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచేస్తుందని జస్టిస్ పార్దివాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపరచాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూర్తులు గురువారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అందుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలుచేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

# సంపాదకీయం

## ట్రంపరితనంను ఎదురించాల్సిందే !

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపి నట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

# శ్రావణ పౌర్ణమియే రాఖీ పండగ



## ఇదేరోజు యజ్ఞోపవీత ధారణ

తిరుమల,ఆగస్ట్8 : శ్రావణమాసంలో అనేక పర్వదినాలు వస్తుంటాయి. విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం చంద్రునితో కూడిన మాసం కావడంతో శ్రావణమాసం అంటారు. ఈ మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. ఆకాశం మబ్బులతో వెండికొండలను తలపిస్తుంటుంది. పూర్వకాలం వేద అధ్యయనం శ్రావణమాసంలోనే ప్రారంభమయ్యేది. విష్యత్‌పురాణంలో రక్షాబంధన్ గురించి వివరించారు. బలి చక్రవర్తిని విష్ణుమూర్తి దేవతల కోరిక మేరకు బంధిస్తాడు. అయితే ఈ బంధం అతనికి రక్షణగా నిలుస్తుందని వరమిచ్చినట్టు తెలుస్తోంది. పాల్కురికి సోమనాధుడు ఈ పౌర్ణమిని నూలి పున్నమిగా అభివర్ణించాడు. కర్ణాటకలో నారికేళ పున్నమిగా పండగ నిర్వహిస్తారు. శ్రావణ పూర్ణిమను భారతదేశమంతా స్థానిక సంప్రదాయాల నేపథ్యంలో వేడుకగా నిర్వహిస్తుంటారు. నార్లీ పండగ, నూలి పున్నమి ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. భారతావనిలో శ్రావణ పౌర్ణమిని పర్వదినంగా పాటించడం వేదకాలం నుంచీ ఉంది. వేదాధ్యయనం చేసేవారు ఉపాకర్మ అనే పేరుతో శ్రావణ పౌర్ణమి రోజున విశేష కార్యాలను నిర్వర్తిస్తుం దేవారు. వారి నియమాలలో ఒకటైన యజ్ఞోపవీతధారణకు ఈ రోజున ప్రాధాన్యాన్ని ఇస్తుండేవారు. ఉపనయనం అనే విధి సంస్కారం దీనికి ఆధారంగా ఉండేది. యజ్ఞోపవీతాన్నే యజ్ఞ సూత్రం అని కూడా అంటారు. ఈ పౌర్ణమినాడు మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్టాల్లో సముద్రతీర వాసులు సముద్రం దగ్గరకు వెళ్లి సముద్రుడిని పూజించి కొబ్బరికాయలను కొడతారు. అందుకే దాన్ని నార్లీ పౌర్ణమి అనిపిలుస్తారు. వేదకాలంలో ఇది సాక్షాత్తు విష్ణుశక్తి స్వరూపంగా ఉన్నట్లు తెలుస్తోంది. రక్షా బంధాన్ని ఇప్పట్లోలా సోదరి, సోదరుడికి కట్టడమనేది తొలిరోజుల్లో ఉండేది కాదు. భర్త చేతికి భార్య కట్టేది. శత్రు జయాన్ని కలిగిస్తాయన్న నమ్మకంతో ఆవాలు, అక్షతలను వేసి పొట్లం కట్టేవారు. ఆవాలు, అక్షితలను రక్షాద్రవ్యం అనేవారు. ఈ రక్షాద్రవ్యాలున్న పొట్లాన్ని ఒక పరిశుభ్రమైన వస్త్రంలో ఉంచి మూటకట్టేవారు. దాన్ని పీఠంపై ఉంచి పూజించిన తర్వాత దాన్ని పురోహితుడితో చేతికి కట్టించుకునేవారు. పూజ చేసిన ఆ పొట్లం విష్ణుశక్తికి ప్రతిరూపమని నమ్మకం. ఆరోజుల్లో రాక్షసులకు, దేవతలకు చాలాకాలం యుద్ధం జరిగింది. రోజురోజుకూ దేవతల శక్తి సన్నగిల్లడం చూసిన ఇంద్రుని భార్య శచీదేవి శ్రావణ పౌర్ణమి నాడు విధివిధానంగా రక్షను రూపొందించి విష్ణుశక్తి స్వరూపమైన ఆ రక్ష మహిమను, శ్రావణ పౌర్ణమి విశేషాలను వివరించి దాన్ని ఇంద్రుడి చేతికి కట్టింది. ఆ తర్వాతే ఇంద్రుడు రాక్షసులను జయించగలిగాడు... ఇలా ఆనాడు ఒక భార్య భర్త చేతికి రక్షా బంధాన్ని కట్టిన సందర్భం ఉంది. కాలక్రమంలో ఆవాలు, అక్షతలు వేసి పూజించి కట్టిన పొట్లం నేడు రాఖీకి మధ్యలో పువ్వుగానో, కుచ్చుగానో మారిపోయి ఉండవచ్చని చెబుతారు. తర్వాత కాలంలో ఇది అన్నకు చెల్లెలు రాఖీగా కట్టే సంప్రదాయంగా మారిపోయి ఉండవచ్చు.

# సృష్టి ఫెర్టిలిటీ కేసు వ్యవహారం

## ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

విశాఖపట్నం,ఆగస్ట్8 : సృష్టి ఫెర్టిలిటీ- కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శిశువుల అక్రమ రవాణా, మధ్యవర్తుల హస్తంతో నడిచిన ఈ అమానవీయ ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. విశాఖ కేంద్రంగా జరిగిన ఈ స్కాంలో ఇప్పటి వరకూ ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా, హైదరాబాద్ పోలీసులు విచారణలో భాగంగా విశాఖలో ముగ్గురు మధ్యవర్తులు అయిన విజయ్, సరోజ, రత్నాను అరెస్టు చేశారు. ఈ మధ్యవర్తులు శిశువుల కొనుగోలు, అమ్మకాల్లో కీలకంగా వ్యవహరించినట్లు- ఆధారాలు లభించాయని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్ వ్యవహారంలో నవజాత శిశువులను పేద కుటు-ంబాల నుంచి తీసుకొని దరఖాస్తు చేసుకున్న జంటలకు పెద్ద మొత్తాలకు విక్రయించినట్లు- పోలీసులు గుర్తించారు. ఇది పూర్తిగా వ్యాపార ధోరణితో నడిచిన శిశువుల అక్రమ ముఠాగా భావిస్తున్నారు. ఈ కేసులో మరొక షాకింగ్ విషయమేమిటంటే, డాక్టర్ నమ్రత స్నేహితులు అయిన డాక్టర్ రమ్య, డాక్టర్ రవిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ శిశువుల అక్రమ రవాణా వ్యవహారంలో ప్రత్యక్ష, పరోక్షంగా భాగమయ్యారన్న ఆరోపణలపై అరెస్ట్ చేశారు. డాక్టర్ రవి, ప్రస్తుతం కేజీహెచ్ ఆసుపత్రిలో అనస్థీషియా విభాగంలో పని చేస్తున్నారు. ఇటు-వంటి బాధ్యత గల స్థాయిలో ఉన్న వైద్యులు కూడా అక్రమ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యారన్న ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశ మవుతున్నాయి. ఈ కేసులో ఇంకా పలువురిపై అనుమానాలు ఉన్నాయని, వీరిలో కొంతమంది రాజకీయ, సామాజికంగా బలమైన వారిగా ఉన్నారని పోలీసులు భావిస్తున్నారు. విశాఖలో ఇంకా అరెస్టులు పెరిగే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

## వరస సెలవులతో గ్రామాలకు జనాలు

### ఆర్టీసీ బస్టాండ్లలో పడిగాపులు

హైదరాబాద్,ఆగస్ట్8 : ఈ నెల 9వ తేదీ శనివారం రాఖీ పండుగ నేపథ్యంలో అక్కాచెల్లెళ్లు తమ సోదరుల వద్దకు వెళ్లేందుకు పయనమయ్యారు. దీంతో ఆడబిడ్డలందరూ ఆయా బస్టాండ్లకు చేరుకుంటున్నారు. కానీ సరిపడా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని ఎంజీబీఎస్ బస్టాండ్‌లో జిల్లాలకు వెళ్లే బస్సుల కోసం ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తున్నారు. కానీ బస్సులు సమయానికి రాకపోవడంతో ఆర్టీసీ అధికారులపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం చేస్తున్నారు. పండుగల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు- చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. శ్రావణ శుక్రవారం, రేపు రాఖీ పండుగ, ఆదివారం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు కూడా తమ సొంతూర్లకు వెళ్లేందుకు బస్టాండ్లకు చేరుకోవడంతో ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి.




## కెటిఆర్‌కు రాఖీ కట్టిన లగచర్ల గిరిజన మహళలు

హైదరాబాద్,ఆగస్ట్8 : భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కొడంగల్ నుంచి వచ్చిన గిరిజన సోదరీమణులు రాఖీ కట్టి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ప్రభుత్వం తమ జీవితాలను, జీవనాధారమైన వ్యవసాయ భూములను లాక్కున్నప్పుడు, తమకు ఒక అన్నలా అండగా నిలిచిన కేటీఆర్‌కు రాఖీ కట్టామని వారు తెలిపారు. కొడంగల్ మండలం లగచర్ల గ్రామం రోటిబండ తండాకు చెందిన జ్యోతి, మరికొంతమంది మహిళలు కేటీఆర్ నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. లగచర్ల భూ పోరాటం సమయంలో నిండు గర్భిణిగా ఉన్న జ్యోతిపై రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పోలీసులు దౌర్జన్యం చేశారని, ఆమె భర్తను జైలుకు పంపిన, సమయంలో కేటీ-ఆర్ ఢిల్లీ వెళ్లి పలు కమిషన్లకు ఫిర్యాదులు చేసి, జ్యోతితో పాటు- లగచర్ల గిరిజనులకు, పేద రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని ఢిల్లీ వేదికగా ఎండగట్టారు. దీని ఫలితంగా, ప్రభుత్వం భూసేకరణను వెనక్కి తీసుకుందని వారు తెలిపారు. కేసుల కారణంగా జైలుపాలైన లగచర్ల సోదర సోదరీమణులందరికీ కేటీఆర్ అన్నగా అండగా నిలబడి, న్యాయ సహాయం అందించారని, అందరినీ జైలు నుంచి విడిపించారని వారు తెలియజేశారు.

# నిండు కుండలా హుస్సేన్ సాగర్..


## 513 మీటర్లకు చేరిన నీటిమట్టం

హైదరాబాద్ : గురువారం రాత్రి హైదరాబాద్ వ్యాప్తంగా వాన దంచికొట్టిన సంగతి తెలిసిందే. దీంతో హైదరాబాద్ నగరం నలు వైపులా వరద పోటెత్తింది. కూకట్‌పల్లి, ఖైరతాబాద్, బేగంపేట్ వైపు నుంచి వరద నీరు భారీగా హుస్సేన్ సాగర్‌కు వచ్చి చేరింది. దీంతో హుస్సేన్ సాగర్ నిండు కుండలా మారింది. హుస్సేన్ సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 514 మీటర్లు కాగా, శుక్రవారం ఉదయం 11 గంటలకు సాగర్ నీటిమట్టం 513.63 మీటర్లకు చేరుకుంది. ప్రస్తుతం హుస్సేన్ సాగర్‌కు 1234 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ఔట్ ఫ్లో 1523 క్యూసెక్కులుగా ఉంది.



# సకల శుభాలు, అఖండ సౌభాగ్యాలు.. వరాలిచ్చే వరలక్ష్మీవ్రతం

శ్రావణమాసం వచ్చిందంటే చాలు ప్రతి ఇళ్లూ కలకలలాడుతుంటాయి. ముఖ్యంగా శ్రావణమాసంలో మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్నిఆచరిస్తారు. శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారాన్ని తిథి నక్షత్రాలతో సంబంధం లేకుండా వరలక్ష్మీ వ్రతంగా జరుపుకొంటారు. అత్యంత శక్తిమంతమైన వ్రతాల్లో వరలక్ష్మీ వ్రతం ఒకటని అంటారు. సకల శుభాలు, అఖండ సౌభాగ్యాలు ప్రసాదించే వరలక్ష్మీ వ్రతానికి విశేష ప్రాధాన్యత ఉంది. అన్ని మాసాల్లో కన్నా శ్రావణమాసం శివకేశవులతో పాటు లక్ష్మీదేవికి ప్రీతికరమైనది. క్షీరసాగర మథనం జరిగినప్పుడు మొదటగా లక్ష్మీదేవి అవతరించిందని పురాణాలు పేర్కొంటున్నాయి. విష్ణుమూర్తిని నారాయణ స్వరూపుడిగా లక్ష్మీదేవిని వరలక్ష్మీగా భావించి వ్రతం ఆచరిస్తే మహిళలకు సకల సౌభాగ్యాలు కలుగుతాయని చెబుతారు. స్కంద పురాణంలో సైతం శివుడు పార్వతీదేవికి వరలక్ష్మీ వ్రతం ప్రాముఖ్యతను గురించి వివరించారు. వ్రతం ఆచరించి తోటి సుహాసినులకు పసుపు, కుంకుమలు అందజేసి ఆశీస్సులు తీసుకుంటారు. చారుమతి కథను చదువుకొని ధూప దీప నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. పెండ్లి అయిన ప్రతి మహిళా వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించాలని పెద్దలు చెబుతారు. చారుమతి కథ..వరలక్ష్మీ వ్రతం సందర్భంగా చారుమతి కథను భక్తిగా చెప్పుకొంటారు. వరలక్ష్మి కటాక్షాన్ని పొందిన మహిళ పేరు అది. చారుమతి అంటే.. మంచి బుద్ధి కలిగినది, మితభాషి అని అర్థం. వ్రతాలను ఆచరించడానికి అందరూ అర్హులేననీ, సామూహికంగా ప్రార్థిస్తే.. ఎక్కువ ఫలితం ఉంటుందనే సామాజిక స్పృహ కలిగిన మహిళ చారుమతి. కుటుంబ ధర్మాన్ని, గృహిణి బాధ్యతలను ఆమె నిర్వర్తించిన తీరు ఆదర్శవంతం.



ఆధ్యాత్మికం

## విద్యార్థులను అభినందించిన పద్మశాలీలు

**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** జాతీయ చేనేత దినోత్సవము సందర్భంగా, కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో శుక్రవారం మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సన్మానం జరిగింది. గ్రామంలో సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న సంఘం నాయకులు, 24-2025 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభను చాటి 550 కి పైబడి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులను ఆత్మీయంగా సన్మానించి, అభినందించారు. అనంతరం సంఘం నాయకులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. విద్యార్థిని, విద్యార్థులు ఇలాగే రాణిస్తూ, ఉన్నత చదువులు చదివి రాజకీయ హోదాలో ఎదగాలన్నారు. ఇక ఈ కార్యక్రమంలో పద్మశాలి సేవా సంఘం మండల అధ్యక్షులు, మాజీ గ్రామ సర్పంచ్ కుందారపు బాపు, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొలిపక సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షులు గుండేటి రాజేశ్, నాయకులు ఏల్లె రామ్మూర్తి, అదే సదానందం, తాటి కొండ శంకర్, బండారి సదానందం, ధనుంజయ, పర్స రమేష్. శ్రీకాంత్, సారయ్య, రమేష్, భాస్కర్, మల్లయ్య, చంద్రయ్య, కుల బాంధవులు పాల్గొన్నారు.

## మండలంలో నూతన రేట్ల పట్టిక అమల్లోకి షాపులు బంద్ చేసిన నాయి బ్రాహ్మణులు



**మంథని,ఆగస్టు 08: (ది క్రైమ్ న్యూస్):** నాయి బ్రాహ్మణుల జీవనోపాధి రక్షణను దృష్టిలో ఉంచుకొని కమాన్పూర్ మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మండలవ్యాప్తంగా ఉన్న మంగళ షాపులన్నీ ఈరోజు బంద్ చేయబడ్డాయి. తిరిగి రేపటి నుండి నూతన రేట్ల పట్టికను అమల్లోకి తీసుకురానున్నట్టు మండల సేవా సంఘం అధ్యక్షుడు మంథని రఘు తెలిపారు. తరాలు మారినా కూడా కనీస జీవనోపాధి లేని పరిస్థితుల్లో ఉన్న నాయి బ్రాహ్మణుల బాధలను దృష్టిలో ఉంచుకొని ఈ రేట్ల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పెరిగిన ధరలు, సామాన్య ఖర్చులతో జీవితాన్ని గడపడం కష్టంగా మారిందని, అందువల్ల ప్రజలు ఈ రేట్లను అర్థవంతంగా స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా కొత్తగా రూపొందించిన రేట్ల పట్టికను మండల అధ్యక్షుడు మంతిని రఘు గ్రామ శాఖ అధ్యక్షుడు గుంజపడుగు రవికుమార్ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గుంజపడుగు సంతోష్, మంతిని చంద్రమౌళి, నరేష్, సమ్మట శేఖర్, గుంజపడుగు సది, చిన్న సది, పెద్ద సది, రాజు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్పొరేట్ జీఎంకు ఆత్మీయ సన్మానం



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి ఎడ్యుకేషన్, ఈ.ఈ.సెల్ కార్పొరేట్ జనరల్ మేనేజర్, ఎజిఎం మురళీధర్ రావు శుక్రవారం రామగుండం రెండవ ఏరియాలో సందర్శించారు. సందర్శనలో భాగంగా ఆయన ఏరియా కార్యాలయానికి రాగా, ఏరియా జనరల్ మేనేజర్ బి. వెంకటయ్య సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన జీఎం వెంకటయ్యతో సమావేశమై స్థానిక సెక్టార్.3 సింగరేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన సిబిఎస్ఈ సిలబస్ విద్యా బోధన కు సంబందించిన అంశాలపై చర్చించారు. తదనంతరం మొదటి సారి ఏరియాకు వచ్చిన ఆయనను, ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య తోటి అధికారులతో కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా అఫిషియేటింగ్ ఎస్ఓ టు జీఎం ఎస్.సంతోష్ కుమార్, వకీల్ పల్లి ఏజెంట్ ఏ.నెహ్రూ, డిజిఎం సివిల్ ధనుంజయ, డిజిఎం ఐఇ మురళీకృష్ణ, ఏరియా సర్వే అధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ, ఎస్ఇ పర్చేజ్ పండరీనాథ్, ఫైనాన్స్ మేనేజర్ తిరుపతి రెడ్డి, డిప్యూటి పర్సనల్ మేనేజర్ వేణు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

## అత్యవసర వైద్య సేవల్లో అప్రమత్తంగా ఉండాలి

### - 108 అంబులెన్సు తనిఖీ చేసిన అధికారులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రమాదం జరిగిన వెంటనే ప్రతీ ఒక్కరూ ముందుగా సంప్రదించేది 108 అంబులెన్సు కోసమేనని, అందుకే అత్యవసర వదియ సేవలందించేలా సంసిద్ధంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్ధన్ అన్నారు. శుక్రవారం పెద్దపల్లిలోని 108 అంబులెన్సులను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ, గర్భిణీ మహిళలు, రోడ్డు ప్రమాదాలు, పాముకాటు, తదితర అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు 108 అంబులెన్సు సేవలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అంబులెన్సులోని పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా కోఆర్డినేటర్ కుమారస్వామి, ఈఎంటీ షానగంటి నరేష్, దేవేందర్, రామినేని రవి, సటుకూరి రాజకుమార్, పూరెల్ల అఖిల్ ఉన్నారు.

# స్థానిక సంప్రదాయాలను ప్రజా చైతన్యం కోసం వినియోగించాలి

- అంగన్వాడి టీచర్లకు ప్రత్యేక పోషణ రాఖీలు పంపిణీ
- 15 వేల గృహాలకు అంగన్వాడీ టీచర్లు వెళ్లి పోషణ బంధం ప్రచారం చేయాలి
- పోషణ బంధం కార్యక్రమం ద్వారా పోషకాహారం ప్రాముఖ్యత పై అవగాహన కల్పన
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాఖీ పండుగ వంటి స్థానిక సంప్రదాయాలను ప్రజా చైతన్యం కోసం వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ శ్రీ హర్ష కు సంక్షేమ శాఖ లోనీ అంగన్వాడీ టీచర్లు మహిళా సిబ్బంది రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం పంచినప్పటికీ, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లలకు అది సరిగ్గా స్వీకరించక పోవడానికి పౌష్టికాహారం యొక్క ప్రాముఖ్యత పై ప్రజలలో అవగాహన లోపం ప్రధాన కారణంగా గమనించామని అన్నారు.స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖలు ప్రచార కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, ప్రజలు ప్రభుత్వ పథకాలను స్వీకరించడం లో నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారని, బలహీనంగా ఉన్న పిల్లలు సాధారణ స్థితికి చేరుకోవడానికి అంగన్వాడీల ద్వారా 'బాలామృతం', 'బాలామృతం ప్లస్' వంటి పోషకాహార పొట్లాలను తల్లిదండ్రులకు అందజేసినా, వాటిని పిల్లలకు సరిగ్గా ఇవ్వడం లేదని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని అన్నారు.ఈ సమస్యను అధిగమించేందుకు పోషణ బంధం' పేరిట రాఖీ పండగ సందర్భంగా ప్రత్యేక 'పోషణ రాఖీలు' తయారు చేయించి, వాటిని జిల్లాలోని అన్ని అంగన్వాడీ టీచర్లకు పంపిణీ చేశామని , ప్రతి అంగన్వాడీ టీచర్ తమ పరిధిలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల ఇళ్లకు స్వయంగా వెళ్లి, ఆ ఇంటిలోని పురుషులకు రాఖీ కట్టి, పోషకాహారం యొక్క అవసరాన్ని వివరిస్తారని అన్నారు. అంగన్వాడీలలో అందించే పూర్వ ప్రాథమిక విద్య, ఒకపూట పూర్తి భోజనం, 'బేటి బచావో, బేటి పడావో' పథకం కింద బాలికల విద్య, సంక్షేమం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారని, వారి పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీకి పంపాలని కోరతారని, జిల్లాలో దాదాపు 15000 గృహాలకు ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు వెళ్ళి చైతన్యం కల్పిస్తారని కలెక్టర్ తెలిపారు. పోషణ బంధం కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని , జిల్లా సంక్షేమ అధికారి , సిడిపిఓ లను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వేణుగోపాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో "రక్షా బంధన్" వేడుకలు





**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** భారతీయ జనతా పార్టీ, కాలనీ మండల అధ్యక్షులు ఆకుల శశి కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం కాలనిలో రక్షా బంధన్ వేడుకలు జరిగాయి. ఉదయం చేపట్టిన కార్యక్రమానికి బిజెపి రామగుండం నియోజకవర్గం బాధ్యులు కందుల సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరై, సింగరేణి రామగుండం రెండవ ఏరియా జీఎం కార్యాలయానికి వెళ్ళి, జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య ను కలిసి "మీరు మాకు రక్ష, మేము మీకు రక్ష. మనమంతా దేశానికి రక్ష" అంటూ, రాఖీ కట్టారు. తదనంతరం పట్టణ నాయకులతో కలిసి రెండవ పట్టణ ఠాణా కు వెళ్ళి పోలీసు సిబ్బందికి, స్తానిక విద్యా సంస్థల ఉపాధ్యాయ ని, ఉపాధ్యాయులకు, విద్యార్థిని, విద్యార్థులకు, మీరు మాకు రక్ష, మేము మీకు రక్ష, మనమందరం దేశానికి రక్ష అంటూ రాఖీలు కట్టి, రక్షా బంధన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మన భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు రక్షాబంధన్ ప్రతీక అన్నారు. తదనంతరం స్తానిక జయశంకర్ నగర్ లోని నల్లపోచమ్మ అమ్మవారి ఆలయ విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఇక ఈ రక్షా బంధన్ కార్యక్రమంలో బీజేపి సీనియర్ నాయకులు మూకిరి రాజు, ఉరగొండ అపర్ణ, మనోహర, ఆకుల కుమార్ గౌడ్, లింగం నాయక్, అయిలవేని అనిల్ కుమార్, పాషా, దూడపాక కుమార్, శ్రీనివాస్, సాగర్, నాగేందర్, అంకం కుమార్, సాయి ప్రణీత్ పాల్గొన్నారు.


# గురుకుల విద్యాలయాలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ప్రతి రోజూ గురుకులాల్లో స్టడీ అవర్స్ నిర్వహించాలి
- పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గురుకులాల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రాబోయే 10వ తరగతి పరీక్షల్లో గురుకుల విద్యాలయాలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురుకులాల నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలోని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదివే 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా అవసరమైన కార్యాచరణను ఇప్పటినుంచి అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతిరోజు గురుకులంలో స్టడీ అవర్స్ నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించి బాగా చదువుకునేలా చూడాలని అన్నారు.జిల్లాలో వర్షాలు ఉధృతంగా కురుస్తున్న నేపథ్యంలో గురుకులాల వద్ద అప్రమత్తంగా ఉండాలని, పిల్లల ఆరోగ్య అంశంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని అన్నారు. పిల్లలకు చల్లబడిన ఆహారం అందించడానికి వీలు లేదని, రెగ్యులర్ గా తాజా ఆహారం వేడి వేడిగా అందించాలని అన్నారు.పిల్లల భోజనంలో ఉపయోగించే కూరగాయలు, ఇతర వంట సామాగ్రి నాణ్యతను ఒకటికి రెండుసార్లు పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో అందుతున్న త్రాగునీరు నాణ్యతను చెక్ చేయాలని అన్నారు. గురుకులం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గురుకులాలోకి దోమలు రాకుండా పూర్తిస్థాయిలో మెష్ ఏర్పాటు చేయాలని అన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో అవసరమైన మరమ్మత్తు పనుల ప్రతిపాదనలు అందిస్తే ప్రాధాన్యత ప్రకారం మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా బీసి అభివృద్ధి అధికారి రంగారెడ్డి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిల్వల గుర్తింపు.... ఇద్దరికి పంచాయతీ జరిమానా



**మానకొండూర్, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల కేంద్రంలో జరుగుతున్న రహదారి వెడల్పు పనుల్లో భాగంగా భారీగా ప్లాస్టిక్ నిల్వలు గుర్తించిన గ్రామ పంచాయతీ శుక్రవారం ఇద్దరికి జరిమానా విధిస్తూ నోటీసులు జారీ చేసింది. మండల కేంద్రానికి చెందిన కోలేటి గోవిందయ్య, కొడిత్యాల వెంకటయ్య అనే ఇద్దరు రహదారిని ఆనుకుని ఉన్న తమ దుకాణా పరిసరాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను పడవేస్తుండగా బారీగా ప్లాస్టిక్ నిల్వలు ఏర్పడడంతో పారిశుద్ధ్య లోపానికి,ప్రజల అనారోగ్యానికి కారణమయ్యారని ప్లాస్టిక్ నిషేధిత చర్యల్లో భాగంగా 2018 చట్టం 87% 88 ప్రకారం కోలేటి గోవిందయ్యకు 3లక్షలు,కొడిత్యాల వెంకటయ్యకు 2లక్షల జరిమానా విధిస్తూ పంచాయితీ నుండి నోటీసులు జారీ చేసినట్లు కార్యదర్శి జున్నుతుల రేవంత్ రెడ్డి తెలిపారు.

## కేంద్ర మంత్రికి మద్దతుగా హైదరాబాద్ తరలిన మండల బిజెపి నాయకులు

**గన్నేరువరం, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల బిజెపి నాయకులు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ పై సీట్ విచారణకు హాజరైన సందర్భంగా మద్దతు తెలిపేందుకు శుక్రవారం హైదరాబాద్ తరలివెళ్లారు. బిజెపి మండలాధ్యక్షుడు తిప్పర్తి నికేష్,నాయకులు సొల్లు అజయ్ వర్మ ఎలేటి చంద్రారెడ్డి పుల్లెల రాము విలాసారం రామచంద్రం పంబాల రాజశేఖర్ బండి తిరుపతి అటికం రామచంద్రం కాంతాళ రాజిరెడ్డి కొంకటి సాయి గణేష్ సాయి దీపు ఎల్ఐటి శేఖర్ రెడ్డి కూన ప్రశాంత్ బద్దం సన్నీ రెడ్డి నూనె రాజేందర్రెడ్డి సుంకరి శ్రీను వడ్ల తేజ తదితరులు హైదరాబాద్ తరలివెళ్లిన వారిలో ఉన్నారు.



# అక్కసుతోనే ప్రతిపక్షాల విమర్శలు

## ◆ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**తిమ్మాపూర్, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం పంపిణీ చేశారు. గత ప్రభుత్వం చేయలేని పనులు కాంగ్రెస్ చేస్తుండగా అక్కసుతోనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, మంచి పనులను కూడా మెచ్చుకోలేని కుసంస్కారులు ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు. గతంలో లాగా కాకుండా అర్థిక సహాయాలను సత్వరమే అందజేస్తూ బీఆర్ఎస్ హయాంలోని దరఖాస్తులకు కూడా ఆర్థిక సహాయాలు మంజూరు చేయిస్తున్నామని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బండారి రమేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి తుమ్మెనపల్లి శ్రీనివాసరావు, నాయకులు గంకిడి లక్ష్మారెడ్డి, చింతల లక్ష్మారెడ్డి,గోగూరి నరసింహారెడ్డి, బండారుపెల్లి లక్ష్మణ్, మార్క రాములు, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య గౌడ్, పోలు రాము, రమేష్, ముప్పిడి సంపత్ రెడ్డి, కంది అశోక్ రెడ్డి, ఎలుక రాజు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు

◆ ఆగస్టు 15 నాటికి రెవెన్యూ సదస్సు దరఖాస్తుల పరిష్కారానికి కృషి ◆ రెవెన్యూ శాఖపై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రెవెన్యూ శాఖ పై అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారం, భూ భారతి దరఖాస్తుల, ప్రజావాణి దరఖాస్తులు, మీ సేవా దరఖాస్తులు, పెండింగ్ భూ సేకరణ తదితర అంశాల పై కలెక్టర్ సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో సింగరేణి , ఎన్టిపిసి, జాతీయ రహదారుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనుల పూర్తి చేసేందుకు అవసరమైన భూ సేకరణ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. నూతన ఆర్వోఆర్ భూ భారతి చట్టం నిబంధనల ప్రకారం అర్హత ఉన్న ప్రతి దరఖాస్తు పరిష్కరించాలని అన్నారు. మనమే రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులు తీసుకుని తిరస్కరిస్తే అనవసరంగా అసంతృప్తి వస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తు తప్పనిసరిగా పరిష్కరించాలని, తిరస్కరించే దరఖాస్తులు ఏదైనా డాక్యుమెంట్ ఉంటే ఆమోదించే పరిస్థితి ఉంటే వాటిని ఫాలో అప్ చేయాలని అన్నారు. భూ సమస్యల దరఖాస్తుల డిస్పోజల్ వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. సాధా బైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం వెరిఫికేషన్ చేసి పెట్టుకోవాలని, హై కోర్టు నుంచి అనుమతి రాగానే సదరు దరఖాస్తుల పరిష్కరించాలని అన్నారు. ఆగస్టు 15 నాటికి భూ భారతి దరఖాస్తులను పూర్తి స్థాయిలో డిస్పోజ్ చేయాలని, ఇక నుంచి జిల్లాలో రెవెన్యూ సిబ్బంది సెలవు రోజుల్లో కూడా పని చేయాలని కలెక్టర్ తెలిపారు. మనం తిరస్కరించే ప్రతి దరఖాస్తుకు ఖచ్చితమైన కారణం ఉండాలని, సదరు వివరాలు దరఖాస్తుదారుడికి సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూముల్లో అసైన్మెంట్ కోసం వచ్చిన దరఖాస్తులలో పేదలు, ప్రభుత్వ మార్గదర్శక ప్రకారం అర్హుల జాబితాను సిద్ధం చేసుకోవాలని, భవిష్యత్తులో అసైన్మెంట్ కమిటీ ద్వారా పట్టా జారీ చేసే అంశం ప్రభుత్వం ఆలోచిస్తుందని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు బి.గంగయ్య, సురేష్ , తహసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

## ◆ అదనపు కలెక్టర్ డి.వేణు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో నిర్వహించు స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డి.వేణు సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ డి.వేణు లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్వాతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని అదనపు కలెక్టర్ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించి ఫ్లాగ్ ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. స్వాతంత్ర వేడుకల డయాస్ , సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆర్ బీ అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు.వేడుకల వద్ద ఏ.ఎన్.ఏం ఆధ్వర్యంలో వైద్య బృందాలచే వైద్య శిభిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన మేర త్రాగు నీటి సరఫరా పనులు మున్సిపల్ కమిషనర్ ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని అన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా ఆగస్టు 11 సాయంత్రం నాటికి అందజేయాలని అన్నారు. ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డి సి పి. కరుణాకర్, ఏ సి పి.జి. కృష్ణ, పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, కలెక్టరేట్ సి విభాగం సూపరింటెండెంట్ ప్రకాష్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక డంప్ సీజ్

- ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణా
- పాముల పేట, మేడిపల్లి ఇసుక రీచ్ మూసివేత
- అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు
- అక్రమ ఇసుక రవాణా పై పత్రికా ప్రకటన విడుదల

చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో 11 అక్రమంగా ఇసుక డంప్ లను సీజ్ చేసి మూసివేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.రామగుండం ప్రాంతంలో 5 ఇసుక డంప్ లు, మంథని ప్రాంతంలో 3 ఇసుక డంప్ లు, శ్రీరాం పూర్, రామగిరి, ధర్మారం మండలాల్లో ఒక్కో అక్రమ ఇసుక డంప్ మొత్తం 11 అక్రమ ఇసుక డంప్ లను గుర్తించి సీజ్ చేయడం జరిగిందని అన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సంబంధిత సెక్షన్లతో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరిగిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పాముల పేట మేడిపల్లి ఇసుక రీచ్ లను శాశ్వతంగా మూసి వేస్తున్నామని అన్నారు.జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ అక్రమార్కులను ప్రకటనలో హెచ్చరించారు.

# ప్రజల కోసం పని చేసే వారికి గుర్తింపు

## - మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రజల హక్కుల పరిరక్షణ, సమస్యలపై పోరాడి వారి కోసం పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. హైదారాబాద్ లోని ఆయన నివాసంలో పెద్దపల్లి పట్టణానికి చెందిన మాదిగ శక్తి వ్యవస్థపాక అధ్యక్షులు బొంకూరి సురేందర్ సన్ని జన్మదిన వేడుకలు మాజీ మంత్రి సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు సురేందర్ సన్నిని ఆశీర్వదిస్తూ ఘనంగా సన్మానించారు. జాతికి సేవచేస్తూ జాతి గర్వించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల సీనియర్ నాయకులు ముంజగళ్ల విజయ్ కుమార్, అంబేద్కర్ జయంతోత్సవాల చైర్మన్ ఇటుక రాజు, మహా ఎమ్మార్పిస్ అధ్యక్షులు నర్సింగ రావు, మాదిగ శక్తి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పినపాటి రజని, భీమ్ ఆర్మీ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బుల్లెట్ సుజిత్ రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## అదీ లెక్క.. ఇది తింటే రక్తం పలుచుగా అవుతుంది

ఈ మధ్య చిన్న వయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయ్.. తక్కువ ఏజ్‌లోనే బీపీ సమస్యలు వెంటాడుతున్నాయ్. ఈ కారణాలతో రక్తం చిక్కబడుతోంది. ఆ రక్తాన్ని గుండె సరిగ్గా పంప్ చేయలేకపోతుంది. దీంతో రక్త ప్రసరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్తం పలుచగా ఉంటేనే..గుండె పంప్ చేసేందుకు ఈజీ అవుతుంది. అందుకే ఈ మధ్య కాలంలో కొంతమంది సమస్యలు ఉన్నా, లేకపోయినా రక్తాన్ని పలుచన చేసే మెడిసిన్ వాడుతున్నారు. గుండె సమస్యలు, హైబీపీ వంటి సమస్యలు ఉన్నవారు.. ఇవి ఒకసారి మొదలెడితే లైఫ్ లాంగ్ వాడాల్సి ఉంటుంది. మీ లైఫ్ స్టైల్ మార్చుకోకపోతే.. జీవితం కాలం ఈ మెడిసిన్ వాడాల్సి ఉంటుంది. ప్రధానంగా తక్కువ నీరు తాగడం, ఎక్కువ ఉప్పు వినియోగం.. నూనె, నెయ్యి లాంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తం చిక్కగా అవుతుంది. మార్నింగ్, ఈవెనింగ్ ఎక్కువ ఉడకని ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ.. మధ్యాహ్నం ఉడికిన ఫుడ్ తిన్నా అందులో ఉప్పు లేకుండా చూసుకుంటే రక్తం చిక్కబడటం ఆగుతుందని చెబుతున్నారు. ఇలా ఫాలో అయితే నెలా, రెండు నెలల తర్వాత మెడిసిన్ మానిసేనా ఇబ్బంది ఉండదని ప్రకృతి వైద్యులు మంతెన చెబుతున్నారు. ఎప్పుడైనా పండక్కి, పబ్బానికి ఉప్పు ఉన్న ఆహారం తింటే పర్లేదు కానీ.. రోజూ ఉప్పు తగినంత వేసిన ఆహారం తింటే తిప్పలు తప్పవంటున్నారు. మనిషి ఆరోగ్య వ్యవస్థను పాడు చేయడానికి ఉప్పే ప్రధాన కారణమని ఆయన అంటున్నారు. మనం తినే ఆహారమే మన హెల్త్‌నుడిపెండ్ చేస్తుందని చెబుతున్నారు.

# సిఎంఆర్ఎఫ్ నియోజకవర్గంలో 75శాతం మంజూరైంది

## - ఎమ్మెల్యే కవ్వంపల్లి



**మానకొండూర్, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 6,837 మంది దరఖాస్తులు పెట్టుకుంటే మండలంలో 208మందికి మంజూరుతో 75 శాతం లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ మంజూరైనట్లు తెలిపి ప్రక్రియను మరింత వేగవంతం చేశామని ఎమ్మెల్యే కవ్వంపల్లి పేర్కొన్నారు.కార్యక్రమంలో తహశీల్దార్ విజయ్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్రచారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్రి ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమలరెడ్డి, డైరెక్టర్లు దాసరి శ్రీనివాస్ యాదవ్, మాతంగి సహదేవ్, నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్,,మడుపు ప్రేమ్ కుమార్, ఇర్ఫాన్,గుడాల మహేందర్ వరహాల చారి, నాగిశెట్టి రాజయ్య, సాయిరి దేవయ్య, మల్లికార్జున్,గొల్లేన కొంరయ్య,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి తోటి కార్మికుల వితరణ



**యైటింక్లయిన్ కాలనీ. (ది క్రైమ్ న్యూస్):** సింగరేణి రామగుండం రెండవ ఏరియా సెక్యూరిటీ విభాగంలో ప్రైవేట్ క్యాంపర్ డ్రైవర్ గా పనిచేసి అనారోగ్యంతో మరణించిన ఇరువురాళ్ల ఇరుగురాళ్ల రాజేందర్ కుటుంబానికి శుక్రవారం తోటి కార్మికులు ఆర్థిక సాయం అందించారు. ఏరియా జిఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ఏరియా సెక్యూరిటీ గార్డులు, ప్రైవేట్ గార్డులు, డ్రైవర్లు కలసి జమచేసిన మొత్తం 56,400 రూపాయలను చెక్కురూపంలో, మృతుని కుటుంబ సభ్యులకు ఏరియా సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మృతుని కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేసి, మృతుని కుటుంబానికి ఎల్లప్పుడు సెక్యూరిటి సిబ్బంది అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ, ప్రైవేట్ గార్డులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా కల్పించాలి

### - మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్ జి



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లోనే కాదు చట్టసభల్లో కూడా కల్పించాలని మంథని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్ జి డిమాండ్ చేశారు. తెలంగాణ శాసనసభలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపిస్తే ఇప్పటికీ కేంద్రం ఉలుకు పలుకు లేకుండా ఉండడం సూచనీయమని ఆయన అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసి గవర్నర్ కు, రాష్ట్రపతికి పంపించిన దీనిపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. అందువల్లే తెలంగాణ కు చెందిన ప్రజాప్రతినిధులు, బీసీ నాయకులు ఢిల్లీలో ధర్నా చేసిన కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం, రాష్ట్రపతి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడం యావత్తు తెలంగాణ సమాజాన్ని అవమానించినట్టుగానే భావించాలన్నారు. శాసనసభ ఏకగ్రీవ తీర్మానంలో పాలుపంచుకున్న బిఆర్ఎస్, బిజెపిలు ఢిల్లీలో చేసిన ధర్నాకు రాకపోగా అవహేళనగా మాట్లాడడం వారి చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. 42 శాతం రిజర్వేషన్లు విద్యా ఉద్యోగ ఉపాధి రాజకీయ రంగంలో కల్పించడంలో టిఆర్ఎస్కు చిత్తశుద్ధి లేదన్నారు. మంథని నియోజకవర్గంలో బీసీ నినాదం ఎత్తుకున్న బిఆర్ఎస్ నాయకులు మీ వైఖరి స్పష్టం చేయాలన్నారు. మీ నాయకత్వం మీద ఒత్తిడి తెచ్చి ఢిల్లీ లో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. బిజెపి ముస్లింలను బీసీల్లో చేర్చినట్టు కుంటి సాకులు చెబుతున్న మీరు గుజరాత్ లో, ఉత్తరప్రదేశ్ మొదలగు రాష్ట్రాల్లో ముస్లింలో ఉన్న బీసీలను గుర్తించి రిజర్వేషన్లు కల్పించలేదా అని ప్రశ్నించారు. బిజెపి ద్వందనితిని ఖండించి బిసి రిజర్వేషన్లు 42 శాతం కోసం పార్టీలకు అతీతంగా బీసీలు అంతా ఏకమై పోరాడేందుకు సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోటికార్ కిషన్ జి అన్నారు.

## ప్రజ సమస్యలు పరిష్కరించుటలో ముందుంటా

### - తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):** కష్టసుఖాల్లో ప్రజలతో మమేకమై వారి బాగోగులు చూసుకోవడమే తమ లక్ష్యం అని రామగిరి మండలం ముస్త్యాల తాజా మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య నాగరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని రాంనగర్ లో బోరు మోటర్ పూర్తిగా కాలిపోవడంతో గ్రామస్తులు లావణ్య నాగరాజు ను కాలిపోయిన మోటార్స్ స్థానంలో నూతన మోటారు కొనివ్వాలని కోరడంతో నూతన మోటర్ తీసుకువచ్చి బిగింప చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఏ రాత్రైనా పగలైనా విషయం తెలిస్తే వారిని ఆదుకునే బాధ్యత మాపై ఉందని అన్నారు. గ్రామ ప్రజలకు సేవ చేయడం మహా పుణ్యమని పేర్కొన్నారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. మోటార్ బిగించి నీటి సమస్యను తీర్చిన రామగిరి లావణ్య నాగరాజు లకు ఆ వాడ ప్రజలు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## వశిష్టలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కపల్లిలోని వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలను బీజేవైఎం పెద్దపల్లి జిల్లా కార్యదర్శి పుల్లూరి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థుల్లో సోదర భావాన్ని పెంపొందించడానికి రాఖీలు కట్టించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల, అక్కా తమ్ముళ్ల ఆత్మీయతకు ప్రేమానురాగాలకు రక్షాబంధన్ వేడుకను జరుపుకోవడం హిందూ సంప్రదాయంలో ఒక భాగమని, రాఖీ అంటే రక్షణ అని, తోబుట్టువుల మధ్య రక్షణ బంధాన్ని బలోపేతం చేసేదే రాఖీ పండుగ అన్నారు. అలాగే తోడబుట్టిన వాళ్ళనే కాకుండా ఎవరినైనా అన్నగా తమ్మునిగా భావించి మానవతా విలువల్ని పెంచే రాఖీ పండుగ విశిష్టతను రాబోవు తరం పిల్లలకు చెప్పడం కోసం వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థుల మధ్య జరపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్ తో పాటు పాఠశాల కరస్పాండెంట్ మరియు హెచ్ఎం మ్యాడగొని కిషన్ గౌడ్, పుప్పాల రమేష్, సిరిసేటి వీరస్వామి గౌడ్, బండారి చిన్న సమ్మయ్య, రెడ్డి శంకర్, సతీష్, అనిల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ నాడే బిక్ష బంధం

**- తండ్రి భూమి కొట్టేసిన కూతురు కేసు పెట్టిన తండ్రి**

**- ఆవేదన వ్యక్తం చేసిన సోదరుడు**



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):** రామిడి పద్మ మా అక్క రక్షాబంధన్ సందర్భంగా మమ్మల్ని బిక్ష బంధం చేస్తుందని పద్మ సోదరుడు శ్రీనివాస్ తన ఆవేదన శుక్రవారం వ్యక్తం చేశాడు. మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలో శనిగల గంగయ్య కు సంబంధించిన భూమి గంగయ్య తండ్రి స్థిరాస్తి గంగయ్య కు తెలియకుండా ఆధార్ కార్డు మార్పిస్తా అంటూ గంగయ్య కూతురు రామీడి పద్మ, భర్త బుచ్చయ్య లు కలిసి సంబంధిత మంథని మండల అధికారులతో కుమ్మక్కై కుటుంబ వివరాలు అడగకుండానే దొంగ పట్టా చేసిందని తెలిపాడు. ఇప్పుడు కుటుంబాన్ని వీధి పాలు చేస్తూ, సోదరుడికి దక్కాల్సిన మొత్తం ఆస్తి నాదంటూ నేను మా నాన్న దగ్గర కొన్న అంటూ బదనాయిస్తూ రౌడీలు గుండాలు బెదిరిస్తుందని పేర్కొన్నాడు. శనిగల శ్రీనివాస్ తమ్ముని కుటుంబాన్ని లేపిస్తం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్న రామిడి పద్మ పై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించాడు.%శ్రీ%. ఈ విషయంపై పలు దఫాలుగా జిల్లా అధికారులకు మండల అధికారులకు స్థానిక పోలీసులకు ఫిర్యాదులు చేసిన ఎవరు పట్టించుకున్న పాపాన పోలేదని తన బాధను వ్యక్తం చేశాడు. కోర్టులో కేసు నడుస్తుందని బదులు ఇస్తున్నారని శనిగల గంగయ్య శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. గొడవలు ప్రేరేపిస్తున్న రామీడి పద్మ భర్త బుచ్చయ్య పై చట్టపరంగా శిక్షించి మా భూమిని మాకు చెందే విధంగా చర్యలు తీసుకోవాలని శనిగల గంగయ్య శనిగల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. రామిడి పద్మ అండ్ గ్యాంగ్ చే మాకు ఏదైనా ప్రమాదం జరిగితే దానికి స్థానిక అధికారులు పూర్తి బాధ్యత వహించవలసి వస్తుందని ఆవేదనతో వ్యక్తపరిచారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ... నవ వధువు మృతి



**తిమ్మాపూర్, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ నవ వధువు అక్కడికక్కడే మృతిచెందింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... చొప్పదండి మండలం రుక్మాపూర్ కు చెందిన ముద్దసాని అఖిల(22)లకు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లొత్తనూరుకు చెందిన చిరుత రాజు(28)తో గత రెండు రోజుల క్రితం వివాహమైంది.కాగా అఖిల బుదవారం వాగేశ్వరి కళాశాలలో పరిక్ష రాసేందుకు భర్తతో ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో శ్రీచైతన్య కళాశాల వద్ద వెనుక నుండి వస్తున్న లారీ ఢీకొట్టి అఖిలపై నుండి వెళ్ళగా తల నుజ్జునుజ్జై అఖిల అక్కడికక్కడే మృతిచెంది భర్త రాజుకు తీవ్ర గాయాలయ్యాయి.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ఘటనకు సంబంధించి మృతురాలి తండ్రి ముద్దసాని నర్సయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ సురేందర్ సింగ్ ముల్తానిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

## రైతులు పునరుత్పాదక వ్యవసాయం పై అవగాహన కలిగి ఉండాలి



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):-** మంథని మండలం లోని ఆరేంద గ్రామంలో పునరుత్పాదక వ్యవసాయం (ఆర్ఏ ) ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు పత్తి యాజమాన్యం పథకంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఫీల్డ్ ఫెసిలేటర్ రాజశేఖర్ మాట్లాడుతూ పునరుత్పాదక వ్యవసాయం వల్ల రైతులు ఆరోగ్యంతో పాటుగా పర్యావరణం మెరుగవుతుందని రైతులకు లాభాలు ఎన్నో చేకూరుతాయని రైతులు రసాయన ఎరువులు వాడేటప్పుడు ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అంతర పంటలు వేసుకోవడం వల్ల కలుగు ప్రయోజనాల గురించి రసాయన మందులకు బదులుగా వేప నూనె వావిలాకు కషాయాలు పిచికారి చేసుకోవాలని నాలుబై ఐదు రోజుల వరకు ఎటువంటి పురుగు మందులు పిచికారి చేసుకోకూడదని పురుగుమందులు పిచికారి చేసేటప్పుడు పీపీఈ ధరించాలని ఓకే గ్రూప్ కు చెందిన పురుగుమందుల మళ్లీమళ్లీ పిచికారి చేయకూడదని అత్యంత విషపూరితమైన పురుగుమందులను వాడకూడదని రైతులకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఫెసిలెటర్లు రాజశేఖర్, మధుకర్ పెద్ద ఎత్తున రైతులు పాల్గొనడం జరిగింది.

# అయ్యా అవ్వకు గుడిశేషినట్టే(నా)?

- బీసీలకు 42% రిజర్వేషన్.
- శాస్త్రీయత లేని కుల గణన.
- అసెంబ్లీ తీర్మానం, ఆర్డినెన్స్.
- జంతర్ మంతర్ ధర్నా.
- రాహుల్ ప్రధాని అయితేనే.



### జంతర్ మంతర్ ధర్నాపై ది క్రైమ్ న్యూస్ అందిస్తున్న రచ్చబండ కాడి ముచ్చట్లు మీకోసం...

**(ది క్రైమ్ న్యూస్) బ్యూరో:** కామారెడ్డి డిక్లరేషన్ కు కట్టుబడి ఉన్నామంటూ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి తీరుతామంటూ, రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం అతని కోరిక తీర్చడానికి రాష్ట్రంలో కల గణన సర్వే చేపట్టి, దేశానికే రోల్ మోడల్ గా నిలిచామంటూ బీరాలు పలికిన రేవంత్ సర్కార్ అసెంబ్లీలో తీర్మానం, ఆపై ఆర్డినెన్స్ జారీ చేసి రాబోయే స్థానిక ఎన్నికల వరకు రిజర్వేషన్ లను సాధించి తీరుతాం.. అని చెప్పడంతో బీసీ వర్గాల్లో ఆనందం వ్యక్తమైన మాట వాస్తవం. అయితే ఈ విషయం మీద ముఖ్యమంత్రితో సహా మంత్రులందరి ప్రసంగాలు విన్న సామాన్య జనం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఖరారు అయిపోయిందని అనుకున్నారు. రేవంత్ సర్కార్ చేసిన గొప్ప కార్యం గానే భావించుకున్నారు. అయితే మళ్లీ ముఖ్యమంత్రితో సహా మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు చోటామోటా లీడర్లు అందరూ కలిసి ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తిరిగి 42 శాతం రిజర్వేషన్ కోసం ధర్నా చేయడం ఏమిటో సామాన్య జనాలకు అంతుచిక్కడం లేదు.

అసెంబ్లీలో తీర్మానం అయిపోయినాక, ఆర్డినెన్స్ కూడా ఇచ్చినాక తిరిగి ఢిల్లీకి ఎందుకు పోయింండ్రు? అని అమాయకంగా అడుగుతున్న జనాల శాతం 42 కు మించిపోతున్నది. కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఆమోదిస్తేనే ఇది సాధ్యం అవుతుందన్న విషయం పాపం ఆ సామాన్య జనాలకు చేరడానికి జంతర్ మంతర్ ధర్నానే కారణం అయింది. వాస్తవానికి చాలామంది పల్లె ప్రజలకు ఈ విషయం మొన్నటి వరకు తెలియదంటే అతిశయోక్తి కాదు.

మోడీ అంగీకరిస్తేనే రిజర్వేషన్లు సాధ్యపడినప్పుడు... మరి స్థానిక ఎన్నికల్లో 42 శాతం చేసి తీరుతం అని గొప్పలు ఎందుకు చెప్పినట్టు? డబ్బాలు ఎందుకు కొట్టినట్టు? అనే ప్రశ్న ఇప్పుడు పల్లెల్లో రచ్చబండల మీద చర్చగా మారింది. తీరా జంతర్ మంతర్ ధర్నా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రధాని అయిన తర్వాత సాధించి తీరుతాం అని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను అన్న మాటలకు అక్షరం ముక్క రాని అమాయకులు సైతం ముక్కున వేలేసుకుంటున్నారు. రాహుల్ ప్రధాని కావాలి అంటే మరో నాలుగేళ్ల తర్వాత జరిగే ఎంపీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ కి వచ్చేసీట్ల మీద ఆధారపడి ఉంటుందన్న విషయం ఇప్పుడు అందరికీ అర్థమైంది. అంటే మరో నాలుగు ఏండ్ల దాకా రిజర్వేషన్ లను సాధించుకో లేనప్పుడు రేవంత్ సర్కార్ బీసీలకు ఒరగబెట్టింది ఏమిటి? అనే చర్చ పల్లెల్లో జోరుగానే సాగుతున్నది. మోడీతో కయ్యం పెట్టుకుని, మోడీని ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే ఎందుకు పని చేస్తాడు? అనే విషయాన్ని కూడా పల్లె జనాలు అర్థం చేసుకోగలుగుతున్నారు. అంటే ఒక విధంగా రేవంత్ సర్కార్ జంతర్ మంతర్ ధర్నాతో సెల్ఫ్ అవుట్ అయినట్టే అంటున్నారు.

ఒక ఊరిలో ఎండాకాలంలో ఆరు బయట మంచాలు వేసుకొని కూలి పనికి వెళ్లే ఇద్దరు కొడుకులు ముసలితనంలో ఉన్న తల్లిదండ్రులకు రాబోయే వానాకాలంలో ఇబ్బంది కలగకుండా మంచిగుడిసె వేయాలనుకున్నారట. ఎలా వేద్దాం? ఏమేం తెద్దాం? ఎంత ఖర్చవుద్ది? ఎవరిని అప్పు అడుగుదాం? ఏం చేసైనా మంచిదే తల్లిదండ్రుల రుణం తీర్చుకుందాం? అంటూ తెల్లారే దాకా ప్రణాళికలు గీశారట. తీరా పొద్దు పొడిచిన తర్వాత అన్న తట్ట పట్టుకుని, తమ్ముడు పార పట్టుకుని... గుడిసె సంగతిని మల్లచ్చే వానకాలానికి చూద్దాంలే... అంటూ కూలి పనికి వెళ్ళినట్టు రేవంత్ సర్కార్ తలపెట్టిన బీసీలకు42 శాతం రిజర్వేషన్ సంగతి కూడా అలాగే ఉందంటూ గ్రామాల్లో రచ్చబండ దగ్గర ముచ్చట్లు పెడుతూ నవ్వుకుంటున్నారు.

## ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా పాల్పడుతున్న వారిపై కేసు నమోదు చేసిన మంథని పోలీసులు







**మంథని,ఆగస్టు 8: (ది క్రైమ్ న్యూస్):** 07/08/2025 రోజున రాత్రి 9.00 గంటలకు మంథని మండలం, కన్నాల గ్రామం శివారు లోని మల్లయ్య ఇటుక బట్టి లో గోదావరి నది నుండి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా దొంగతనంగా తరలించి అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను జీజ సహాయంతో రెండు టిప్పర్ లలో ఇసుకను జగిత్యాల కు అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లను 1. 1826 02 2724 టిప్పర్లను, ,ఇసుక దంపును సీజ్ చేసి కేసు నమోదు చేయడమైనది .వారి వివరాలు: 1. వాసం సతీష్ పాసిగం గ్రామం వెల్గటూర్ మండలం జగిత్యాల జిల్లా 2. ముష్కి రాజ్ కుమార్ సతీష్ లక్కారం సెంటినరీ కాలనీ 3. ఎర్రం సంతోష్ తండ్రీ చంద్రయ్య , వయసు 33 , కులం తెలుగు గ్రామం మైదంబండ ముత్తారం మండలం 4. తనుగుల మహేష్ తండ్రి తిరుపతి, వయసు 34, కులం పెరిక గ్రామం రాయపట్నం ధర్మపురి మండలం జగిత్యాల జిల్ల 5. తన్నీరు మల్లికార్జున్ తండ్రి రాములు, వయసు 35, కులం వడ్డెర జగిత్యాల 6. పొట్ల రాజశేఖర్ తండ్రి రామ్ చందర్, వయసు 32, కులం ఎస్సీ మాదిగ , గ్రామం లద్నాపూర్ , రామగిరి మండలం 7. పోయిల భాస్కర్ తండ్రి శంకర్, వయసు 28, కులం ఈఎస్సీ మాదిగ గ్రామం కన్నాల మంథని మండలం 8. పిక్కల మల్లయ్య ఇటుక బట్టి ఓనర్అని అని మంథని ఎస్సై రమేష్ గారు తెలిపినారు.అదేవిధంగా మంథని మండలంలోని ప్రజలు ఎవరైనా అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను నిలువ చేసిన, తరలించిన వారిపైన చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకున్న పడతాయని హెచ్చరించారు.మంథని ఎస్ఐ.

## జమ్మికుంట పోలీస్ స్టేషన్‌లో ముందస్తు రాఖీ వేడుకలు



**జమ్మికుంట ఆగస్టు 8 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో ముందస్తు రాఖి వేడుకలను స్థానిక పోలీస్ స్టేషన్ లో మహిళా కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళు జమ్మికుంట టౌన్ సిఐ. రామకృష్ణ గౌడ్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రాఖీ పండుగ సందర్భంగా జమ్మికుంట పట్టణ, గ్రామాల ప్రజలకు రాఖీ పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

## ఘనంగా కాంగ్రెస్ నాయకులు బండి మల్లేష్ జన్మదిన వేడుకలు..



**జమ్మికుంట ఆగస్టు 8 (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జిల్లా ఫిషర్మెంట్ చైర్మన్ బండి మల్లేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బండి మల్లేష్ మండలంలోని దుబ్బ మల్లన్న, బిజిగిరీ షరీఫ్ దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎ. శ్రీనివాస్, సలీం పాషా, రంజిత్ రెడ్డి , పజిల్, సలీం లు కేక్ కట్ చేసి మల్లేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రవ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆగస్టు 11..

**- మెద్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. సి ఉమా గౌరీ**




**శామీర్ పేట, ఆగస్టు 06 (ది క్రైమ్ న్యూస్) :**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం ఆగస్టు 11న మోప్ అప్ డే ఆగస్టు 18న పిల్లల ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా, రాష్ట్రవ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఆగస్టు 11, 2025 న నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఏవైనా కారణాలతో మందు తీసుకోలేకపోయిన పిల్లల కోసం మోప్ అప్ డేను ఆగస్టు 18, 2025 న నిర్వహించనున్నారు. ఇప్పటికే ఫిబ్రవరి 2025న జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని, అనివార్య కారణాల వల్ల వాయిదా వేసి, తాజాగా ఆగస్టులో నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బుధవారం మెద్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. సి ఉమా గౌరీ మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యంగా ఎదుగుదల కోసం నులిపురుగుల నివారణ అత్యంత అవసరం. ఇవి పోషకాహార లోపానికి, బలహీనతకు, చదువుపై దుష్ఫలితాలకు కారణమవుతాయి. అందుకే ప్రతి తల్లి%-తండ్రి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలి మరియు ఈ కార్యక్రమంలో: 1%-%5 సంవత్సరాల పిల్లలకు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 6%-%19 సంవత్సరాల పిల్లలకు: ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్లు మరియు జూనియర్ కాలేజీల ద్వారా నులిపురుగుల నివారణ మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, ఇతర లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమన్వయంగా, మండల స్థాయి శిక్షణలు, హెల్త్ సెంటర్ స్థాయి ప్రణాళికలు రూపొందించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. వీ. కౌశిక్ గారు మాట్లాడుతూ,"ప్రతి బడిలో, ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో అవసరమైన మందులు, శిక్షణ పొందిన సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. పిల్లలు ఈ మందులను తప్పకుండా తీసుకోవాలి. అందరికీ నులిపురుగుల నివారణ మందులు అందించే లక్ష్యంతో మాపు అప్డేను కూడా ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు.ఈ సందర్భంగా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ గారితో వర్చ్యువల్ సమావేశానికి అన్ని లైన్ శాఖలు విద్యా శాఖ, బీసీ/ఎస్సీ/ఎస్టీ/ మైనారిటీల హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు. ఈ వర్చువల్ సమావేశం డీఎంహెచ్ఓ, మెద్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యాలయం నుండి పాల్గొన్నారు.

# నాన్నకు ప్రేమతో కన్నీటి లేఖ..

## ◆ నాన్నా నిన్ను చివరిచూపు చూస్తానా..? ◆ మావోయిస్టు అగ్రనేత మల్లా రాజిరెడ్డి కూతురు స్నేహలత

**రామగిరి,ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్) :** మంథని మండలం శాస్త్రులపల్లి వాస్తవ్యులు భారత కమ్యూనిస్టు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పోలీట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి కూతురు స్నేహలత రాసిన లేఖ శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.నేను క్షేమం... యుద్ధంలో ఉన్న నీ క్షేమాన్ని కోరటం అత్యాశే అవుతుంది. నిన్ను చూసే, నీతో మనసారా మాట్లాడే అవకాశం నాకెలాగూ లేదు. కనీసం నిన్ను చివరిచూపు చూస్తానో లేదోననే ఆందోళనతో...ఈ బహిరంగలేఖ రాస్తున్నాను. మొన్న నంబాల కేశవరావు అంకుల్‌ను అనాథగా దహనం చేసిన తర్వాత కనీసం నీ పార్థివదేహాన్ని చూడగలననే ఆశ కూడా కోల్పోయాను. నీతో ఇలా సంభాషించవలసి రావటమే అతి పెద్ద విషాదం. గత సంవత్సరం జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో నీవే మరణించావని వార్త పొక్కింది. అది నిజమో, కాదో తేల్చుకోలేక వారం పాటు బాధాతప్త హృదయంతో ఉండిపోయాం. ఎన్‌కౌంటర్ వార్త విన్నప్పుడల్లా మా ఇద్దరు పిల్లలు 'తాత ఎలా ఉంటాడమ్మా' అని అడుగుతున్నారు. సరిగ్గా నలభై ఏళ్ల కిందట 'నాన్న ఎలా ఉంటాడమ్మా' అని నేను మా అమ్మని అడిగిన రోజులు నా స్మృతిపథంలోకి వచ్చాయి. కాలం చూడు ఎలా గడిచిపోయిందో. నీవు అజ్ఞాతంలోకి వెళ్లి యాభై ఏళ్లు గడిచాయి. మొన్న ఎవరో అంటే విన్నాను నీవు, మల్లోజుల కోటేశ్వరరావు, గణపతి అంకుల్ మొదటితరం నాయకులని. మీ జీవితంలో మూడోవంతు ప్రజలకు అంకితం చేసారు. ఏ మనిషికైనా ఇలాంటి జీవితం అరుదుగా లభిస్తుంది. స్వాతంత్ర్య పోరాటంలో వీరుల గాథలను పుస్తకాలలో చదివాను. ఇప్పుడు స్వయంగా నా తండ్రే అలాంటి చరిత్రలో భాగమైనందుకు గర్వంగా ఉంది. నేను పుట్టేనాటికే నీవు విప్లవాన్ని ప్రేమించావని అమ్మ చెప్పింది. అంతకు మునుపే నీవు అమ్మను ప్రేమించావు. ఆమె నిన్ను, నీవు కోరుకున్న విప్లవాన్ని ప్రేమించి, పొత్తిళ్లలో ఉన్న నన్ను వదిలివేసి నీతో వచ్చింది. తల్లీ తండ్రీ ఉండి కూడా అనాథలా బతికాను.నిరాదరణ, ఈసడింపులు జీవితాన్ని వెక్కిరించాయి. దుఃఖం కట్టలు తెంచుకొని నిద్రలేని రాత్రులు నాతో సహవాసం చేశాయి. బంధువులకు భారమైనప్పుడల్లా నేను గూడులేని పక్షినే. ఆరేళ్ల వయసులో అనుకుంటాను నేనున్న



చోటుకు సంవత్సరం తర్వాత ఒకరోజు అమ్మ వచ్చింది. నేను అమ్మను గుర్తుపట్టలేదు. యథాలాపంగా నా ఆటలో నేను మునిగిపోయాను. ఆమె నా దరి చేరి అక్కున చేర్చుకొని 'నేను మీ అమ్మనని' చెప్పింది. ఈ ప్రపంచంలో ఏ తల్లికి అలాంటి పరిస్థితి రాకూడదని కోరుకుంటున్నాను. ఇక ఆ తర్వాత అమ్మ కూడా నా దగ్గరకు రావటం తగ్గిపోయింది. నేను అక్షరాలు నేర్చుకుంటున్న సమయంలోనే నా బాగోగులు చూసుకుంటున్న వారిని వదిలి మరో చోటుకు పంపించారు. హాయిగా అమ్మ ఒడిలో నిద్రించవలసిన వయసు, చందమామ కథలు వినవలసిన సమయం, గోరుముద్దలు తినవలసిన కాలంలో బతుకు చితికి, కన్నీళ్లు మింగాల్సివచ్చింది. బాలకార్మికురాలి పాత్రలోకి జీవితం తర్జుమా అయింది. ఉదయాన్నే నిద్రలేచి, నా వయసుకు తగని పనులు చేసి, అప్పటికే అలసిపోయి బడికి వెళ్లేదాన్ని. కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర నాకు చాలా దూరంగా ఉండిపోయాయి. పారిపోవాలని ఉండేది కానీ గమ్యం తెలియదు. చనిపోవాలని అనిపించేది కానీ మార్గం తెలియదు. అప్పుడప్పుడు ఊళ్లోకి వచ్చే నీ సహచరులు కనుక్కునే యోగక్షేమాలే నాకు లభించే ఊరట. ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో డాక్టర్ కావాలని ఉండేది కానీ, నాకు సరైన దారి దొరకలేదు సరికదా దారిచూపేవాళ్లూ లేరు. అప్పుడనిపించింది.



అందరిలాగా నాకు అమ్మానాన్న ఉంటే ఇష్టమైన చదువు దొరికేది కదా! అని. అంతిమంగా నావి అస్థిరమైన వానాకాలం చదువులయ్యాయి. నా ప్రమేయం లేకుండానే నేను ఉండే స్థలం, చదువు నిర్ణయం జరిగి మారుతుండేవి. అలా హైదరాబాద్ నగరానికి మారిపోయాను. లక్షలాది మంది అనాథలను, వలస కార్మికులను తన ఒడిలో చేర్చుకున్న ఈ నగరం నాకింత చోటిచ్చింది. కాస్త జీవితాన్నిచ్చింది. కొంత జ్ఞానానిచ్చింది. కొత్త స్నేహాలు, రాజకీయాలు, సామాజిక చలనాలు, ఆచరణ, అధ్యయనం నాకింత మనోధ్కైర్యాన్ని ఇచ్చాయి. ప్రపంచం అర్థమయ్యేకొద్దీ సాంత్వన లభించింది. సరిగ్గా ఈ సమయంలోనే నా జీవితాన్ని అల్లకల్లోలం చేసిన పిడుగులాంటి వార్త విన్నాను. చంటి పిల్లగా నన్ను వదిలేసిపోయిన మా అమ్మ ఎన్‌కౌంటర్ అయింది (ఆగస్టు 13, 1998). అది జరిగిన నెల రోజులకు నాకు ఆ విషయం తెలిసింది. అనాథ శవంగా మా అమ్మ మిగిలిపోయింది. ఆమెను ఎవరో ఖననం చేసారు. పిచ్చిదానిలా హైదరాబాద్ రోడ్లు పట్టి తిరిగాను. రాత్రి, పగలని తేడా లేకుండా సంచరించాను. నిద్రాహారాలు మాని దుఃఖాన్ని ఆశ్రయించాను. ఒంటరిదాన్ని అయిపోయాను. కనిపించని శత్రువుతో మౌనంగా యుద్ధం చేసాను. తండ్రి ఉండీ రాలేదు. తల్లి మరణించింది. ఈ జీవితం ఎందుకని ఎన్నిసార్లు అన్పించిందో! ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో సీటురావటం నా జీవితానికి చుక్కానిలా అన్పించింది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో భాగస్వామ్యం కావటం వలన మామూలు మనిషిని కాగలిగాను. కానీ నేను పెళ్లి చేసుకున్న రోజు నీవు నా పక్కన ఉంటే ఎంత బాగుండునో కదా! నీ మనుమరాలు నా కడుపులో పడినప్పుడు ఈ వార్త నీతో చెప్పాలని ఎంత ఆశపడ్డానో. అందరు స్త్రీల వలె తల్లిదండ్రుల చేతుల మీదుగా నాకు సీమంతం జరగాలని ఎన్నిసార్లు అన్పించిందో. బాలింత వాసన తీరకముందే నా బిడ్డకు నేనే స్నానం చేయించుకోవలసి వచ్చింది. నీ చేతుల్లో ఆడుకోవాలని, నీ భుజాల మీద కూర్చోవాలని, నీ వేలు పట్టి నడవాలని ఎన్నోసార్లు కోరుకున్నాను. కనీసం నా పిల్లలన్కెనా నీవు ఎత్తుకుంటే చూసి మురిసిపోవాలని భావించాను. డియర్ నాన్న, నేను కోరుకున్నవేవీ జరగలేదు, జరుగుతాయనే నమ్మకం లేదు. కానీ నీవు, నీ సహచరులు క్షేమంగా ఉండాలని, నీకు ఏ ప్రమాదం జరగకూడదని బిడ్డగా నా కోరిక. నీవు కోరుకున్న పోరాటం జయాపజయాలతో నిమిత్తం లేకుండా, విరామమెరుగని నీ ప్రయాణంలో 'మా నాన్న హీరోనే'నని నా పిల్లలకు చెప్పే రోజొకటి ఉంటుందని మాత్రం చెప్పగలను. నీవు మల్ల రాజిరెడ్డివో, మీసాల రాజన్నవో, సాయన్నవో, సంగ్రాంవో, మురళివో నాకు తెలియదు. నాకు మాత్రం బాపువే... అంటూ స్నేహలత రాసిన లేఖ సంచలనం సృష్టించింది.

# గంజాయి వద్దు.. ఆరోగ్యం ముద్దు...

## ◆ పట్టణంలో విస్తృతంగా సామాజిక కార్యకర్త వేణుగోపాల్ ప్రచారం..

**హుజూరాబాద్ ఆగస్ట్ 8 (ది క్రైమ్ న్యూస్):** గంజాయి వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ శుక్రవారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గంజాయి వద్దు ఆరోగ్యం వద్దు ఆ అనే బోర్డును తన మెడలో వేసుకుని సబ్ రిజిస్టర్ ఆఫీసు ఎస్సార్ ఆసుపత్రి ఏరియా, భరత్ పంప్ ఏరియా, సిరసపల్లి క్రాస్ రోడ్ తదితర ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు గ్రహీత నలుబాల వేణుగోపాల్ మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి ఇతర నిషేధిత మత్తు పదార్థాలపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపాలని కోరారు. డ్రగ్స్, గంజాయి ఇతర రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రంలోకి రాకుండా సమూలంగా అరికట్టాలన్నారు. డ్రగ్స్, నిషేధిత మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని, అందుకు అనుగుణంగా ఇటీవల ఉక్కు పాదం మోపుతోందని గుర్తు చేశారు. ప్రజల ప్రాణాలు కాపాడే వైద్య విద్యను అభ్యసిస్తున్న మెడికోలు గంజాయి మత్తులో తూలుతూ గంజాయినీ సేవించడం ఎంతో బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో క్రమక్రమంగా గంజాయి వినియోగం ఇటీవల పెరుగుతున్నట్లు మీడియా ద్వారా తెలుస్తుందని ఇప్పటికైనా




పోలీస్ డిపార్ట్మెంట్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని గంజాయి, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని వేణుగోపాల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి రమేష్, మడుగు రమేష్, కారంకంటి రవీందర్, ఆదిమూలము అజయ్, కొల్లూరి ఆనంద్, పరకాల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి టీవాస్తవ లాభాలు ప్రకటించి 35 శాతం కార్మికులకు చెల్లించాలి

## - సీఐటీయూ ఆర్.జి.-త్రీ కార్యదర్శి దొమ్మటి కొమురయ్య



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):** రామగుండం ఏరియా ఆర్.జి-త్రీ లోని ఓసీ-టు లో ప్రాజెక్టు అధికారి వెంకట రమణ కి యాక్టింగ్ మేనేజర్ సంపత్ కుమార్ కి సీఐటీయూ ఆధ్వర్యంలో మెమొరాండం ఇవ్వడం జరిగింది.2024-25 ఆర్థిక సంవత్సరం పూర్తయి నాల్గు నెలలు గడుస్తుంది. ఇప్పటివరకు వాస్తవ లాభాలు ప్రకటించ లేదు.మేలో ఇచ్చే ఆనువాయితి ఉండేది.కార్మికులు ఎదురుచూస్తున్నారు. పిల్లల స్కూల్,కాలేజీ పీజుల చెల్లింపులకు అవస్తలు పడుతున్నారు. కావున వాస్తవ లాభాలు ప్రకటించి 35 శాతం కార్మికుల వాటా వెంటనే చెల్లించాలి. గత సంవత్సరం లాభాల లెక్కించడంలో పారదర్శకత లోపించిందని కార్మికుల అనుమానం. కావున పారదర్శకంగా లెక్కించి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని సీఐటీయూ డిమాండు చేస్తుంది.ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి దొమ్మటి కొమురయ్య నాయకులు ఎం.వెంకటేశ్వర్లు,కే. వేణుగోపాల్ ఏన్. రమణా రెడ్డి,పి. మల్లికార్జున్ ఈ.కుమార్, మీనయ్య తదితరులు పాల్గొన్నారు.

# భూభారత్ రెవెన్యూ సదస్సులో ఎన్ని అర్జీలు వచ్చాయి..

## - మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి




**శామీర్ పేట, ఆగస్టు-08 (ది క్రైమ్ న్యూస్):** భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తు ల పరిష్కార దిశలో భాగంగా మూడు చింతలపల్లి తహాసీల్దారు కార్యాలయాన్ని అదనపు కలెక్టరు తనిఖీ చేసారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ భూభారతి ఆన్ లైన్ ద్వారా, రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు దారులు ఇచ్చిన దరఖాస్తు లు ఎంత వరకు పరిష్కారమయ్యాయని మూడు చింతలపల్లి తహసిల్దారును అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి అవుతున్న జాప్యానికి గల కారణాలను పరిశీలించారు. సాంకేతిక పరమైన ఏమైన ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే క్లియర్ చేసుకోవాలని, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఆన్ లైన్ లో మ్యానువల్ గా పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను అదనపు కలెక్టరు పరిశీలించారు.

# ఘనంగా శ్రీ వెంకటేశ్వర స్వామి నూతన ఉత్సవ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

## - ప్రత్యేక పూజ కార్యక్రమాలు, పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు



**హుజూరాబాద్ ఆగస్టు 8 (ది క్రైమ్ న్యూస్):** హుజూరాబాద్ పట్టణంలోని కేసీ క్యాంపులో గల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, సుదర్శణ నారసింహ ఉత్సవ మూర్తి ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కాగా నూతన ఉత్సవ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు మంగళవారం నుండి ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు నిఖిలాచార్యులు, నందకిశోరాచార్యులు, శ్రీహర్షచార్యులు, సుదర్శనా చార్యులు, రామాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ విగ్రహాలను గూడూరు ప్రభాకర్ రెడ్డి సుమావాణి, ఊరడి సుధాకర్ రెడ్డి-సుగుణ, పీవీ నరేష్, సారయ్య- సుజాత, చందా నగేష్- జ్యోతి, రాజు, సురేందర్, గణపతిరెడ్డి బహూకరించారు. కాగా శుక్రవారం ఆలయంలో ప్రాయశ్చిత్త హోమం, మహా పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాల తో పాటు, నేత్రోన్మలనం, కుంభప్రోక్షణ, ద్రిష్టి కుంభ, శాంతి కళ్యాణం, ఋత్విక్ గరణం, మహదాశీర్వచనం, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు మోహన్ రెడ్డి దంపతులతో పాటు, ఉపాసి సురేందర్ దంపతులు తోపాటు భక్తులు పాల్గొన్నారు.

# ఆరుబయట చెత్త వేయడం నేరం..

## - అందుకు జరిమానా రూ. 5000/- వరకు..



**శామీర్ పేట, ఆగస్టు 08 (ది క్రైమ్ న్యూస్):** స్వచ్ఛ భారత్ బోధన ఎన్నిసార్లు చెప్పిన ఫలితం లేకుండ పోతుంది, ఆరుబయట చిత్తవేసిన వారిపై ?5000. వేల రూపాయలు జర్మన్ వేధించడం జరిగిందని తుంకుంట మున్సిపల్ కమిషనర్ ఎంఎన్ఆర్ జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆరు బయట చెత్త వేయడం పర్యావరణానికి కలుషితం చేయడమే. అందుకు దేవాలయం లో ఓ వ్యక్తి ఆరు బయట చెత్త వేయడంతో మున్సిపల్ అధికారులు వారికి ఐదు వేల రూపాయలు జరిమానా విధించింది. కమిషనర్ మాట్లాడుతూ ఆరు బయట చెత్త వేయకూడదని మున్సిపల్ చట్టం ప్రకారం ఆరుబాట చిత్త వేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని గతంలో కూడా హెచ్చరించడం జరిగిందన్నారు. ఆరు బయట శతవేయడం వాళ్ళ విసర్జన మల విసరణ చేయడం లాంటిది జరుగుతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం

## - సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్





**ధర్మపురి, ఆగస్టు 8, (ది క్రైమ్ న్యూస్):** ధర్మపురి పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు అయిన కాశెట్టి వాడలో అకాల వర్షాల కారణంగా ఇళ్లలోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శుక్రవారం పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ఆయన మాట్లాడి వారి సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అధికారులతో పరిస్థితిని సమీక్షించిన మంత్రి ధర్మపురి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేయడం, సీసీ రోడ్ల నిర్మాణం, నీటి నిల్వలు, మురికి నీరు గోదావరిలో కలిసే సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ యంత్రాంగం ముందుగానే చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రొంపికుంటలో ఘనంగా చేనేత దినోత్సవ వేడుకలు

## ● చేనేత పద్మశాలీలకు సన్మానం ● పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ చూపిన పద్మశాలి విద్యార్థులకు సన్మానం, ప్రశంస పత్రాలు అందజేత



**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):-** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా మంథని డివిజన్ కమాన్ పూర్ మండల పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మికులకు సన్మానం, గత సంవత్సరం పదవతరగతి ఫలితాలలో ప్రతిభచూపిన ఉమ్మడి కమాన్పూర్, రామగిరి మండల పద్మశాలి విద్యార్థులకు ప్రశంస పత్రాల జ్ఞాపికలు అందజేస్తూ వారిని తల్లిదండ్రులతోసహా ఘనంగా సన్మానించారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలోని పద్మశాలి భవనంలో గత ఐదు సంవత్సరాల నుండి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న నిర్వాహకులు, మండల పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులు, మాజీ సర్పంచ్ కుందారపు బాపు అధ్యక్షతన గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు కొలిపాక సత్తయ్య, గుండేటి రాజేష్ , ప్రముఖ కవి, గాయకులు, జిల్లా పద్మశాలి సంఘం కార్య నిర్వాహక కార్యదర్శి అందె సదానందంతోపాటు పలువురు ముఖ్యతిథులుగా హాజరై ప్రసంగించినారు. మొదట కులదైవం మార్కండేయ పటానికి పూలమాల అలంకరణ, పూజా నమస్కారంతో ప్రారంభించిన ఈ వేడుకలలో జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆరుగురు చేనేత పద్మశాలియులు కుందారపు చంద్రయ్య, శంకరయ్య, రాజయ్య, నర్సయ్య, నామని రాయలింగు, బంగారి గట్టయ్యలను శాలువాలతో ఘనంగా సన్మానించినారు. ఈ శుభసందర్భంగా 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన రామగిరి మండలంలోని ఐదుగురు పద్మశాలి విద్యార్థులు సిరిపురం వర్షిత బేగంపేట(587), చిప్ప సాత్విక్ సెంటినరీ కాలనీ (581), వొడ్నాల అరవింద్ రాంనగర్-రత్నాపూర్(574), సూరం అక్షిత కల్వచర్ల(573), పులి రేవర్షిని కల్వచర్ల(568), కమాన్పూర్ మండలంలోని ముగ్గురు బండి అక్షర జూలపల్లి(556), కొండి రాకేష్ రొంపికుంట(552), బండి రఘునాథ్ నాగారం(550), వారి తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించి, ప్రశంస పత్రాల జ్ఞాపికాలను అందజేయడం జరిగినది. సీనియర్ జర్నలిస్టు, జనం సాక్షి మంథని ఆర్.సి మాటేటి కుమార్, తన డిగ్రీ ముగిసిన వెంటనే మంచి ప్యాకేజ్ తో క్యాప్ జెమినీ కంపెనీలో ఉద్యోగం పొందిన వొడ్నాల ఇందు, సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న పద్మశాలి ఫోటోగ్రాఫర్ కొండి అనిల్, డెకరేషన్ సౌండ్స్ కుందారపు శేఖర్ లను అభినందిస్తూ శాలువాలతో ఘనంగా సన్మానించారు. వక్తలు మాట్లాడుతూ అందరూ చేనేత వస్త్రాలు ధరించి, చేనేతదారులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

గత ఐదు సంవత్సరాలనుండి కుందరపు బాపు ఆధ్వర్యంలో పద్మశాలిలకు అందజేసిన ప్రతిభ పురస్కాలను గుర్తుచేస్తూ, ప్రతి యేడు ఇలాగే ఆనవాయితిగా నిర్వహించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలద్వారా మన పద్మశాలిల ప్రతిభను గుర్తించి, ఆదరించి ప్రోత్సహించడం, సంఘాలద్వారా ఐక్యత చాటడం చాలా సంతోషాన్నిస్తుందని అన్నారు. అనంతరం నిర్వాహకులు అతిథులను చేనేత తువ్వాలులతో ఘనంగా సన్మానించి గౌరవించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉమ్మడి కమాన్పూర్ మండలం మాజీ జెడ్పిటిసి మాజీ సర్పంచ్ ఎల్లె శశిరేఖ రామ్మూర్తి, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు బూర్ల ధనుంజయ, బండారి సదానందం, గూట్ల రమేష్, గుండేటి మూర్తి, పర్ష రమేష్, చిప్ప భాస్కర్, ఎనగందుల శ్రీకాంత్, అనుమ లింగయ్య గార్లతోపాటు బత్తుల సమ్మయ్య, కుందారపు సత్యం, కొండి శంకరయ్య, కుందారపు శంకరయ్య, గుండేటి శంకర్, వేముల వెంకటేశం, రాంపల్లి రవి , సూరం సదయ్య, వోడ్నాల రాధాకృష్ణ, రఘుపతి, పుల్లే మల్లేష్, మెరుగు శ్రీనివాస్, ఊరకొండ కనకయ్య, కుందారపు మల్లయ్య, వేముల శ్రీనివాస్, పడాల మల్లేష్ కుందారపు రమేష్, గుండు మధు, మచ్చ అంజయ్యలతో పాటు మండలంలోని పద్మశాలీయులు పాల్గొన్నారు.





# ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్ డేట్ అవుతుందా..

## ● పి హెచ్ సి సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ.. ● మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి





**శామీర్ పేట కలెక్టరేట్, ఆగస్టు 08 (ది క్రైమ్ న్యూస్) :** ప్రజలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా.. డాక్టర్స్ ఎలాంటి పర్యవేక్షణను ఉండాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి ఆకస్మిత తనకి నిర్వహించారు. శుక్రవారం కాప్రా మండలంలోని జవహర్ నగర్ పి హెచ్ సి సెంటర్ ను జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎఎన్ సి ఎన్ని కేసులు మిస్ అవుతున్నాయని, పరీక్షలకు రానివారిని ఏవిధంగా గుర్తిస్తున్నారని గైనకాలజిస్టు డాక్టరును అడిగి తెలుసుకున్నారు. ఎఎన్ సి పరీక్షలకురానివారిని గుర్తించి ఆశావర్కర్లు, ఎఎంసిల ద్వారా వారికి కౌన్సిలింగ్ ఇప్పించాలని కలెక్టరు తెలిపారు. సి సెక్షన్ వరకు వెళ్లకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేలా పేషంట్లకు జాగ్రత్తలు, సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు ల్యాబరేటరీని పరిశీలించిరోజుకు ఎన్ని పరీక్షలు చేస్తున్నారని, ఇక్కడ ఎన్ని పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఇక్కడ లేని పరీక్షలు ఎక్కడ చేయిస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. . ఓపి పేషంట్ల నమోదు రిజిస్ట్రేషన్ హిస్టరీ అప్ డేట్ అవుతుందా అని కలెక్టర్ ఆరా తీసారు. కలెక్టర్ ఆసుపత్రి మొత్తం కలియ తిరిగి పరిశీలించి, అవసరమైన మరమ్మత్తులకు ఎస్టిమేషన్స్ వేసి తనకు పంపాలని కలెక్టర్ మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. రోగులకు అందిస్తున్న సేవలు, సిబ్బంది హాజరు పట్టిక ఓపి రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, పరిశీలించి వైద్య సిబ్బందికి తగు సూచనలు చేశారు. పేద ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం వైద్య శాఖను బలోపేతం చేస్తూ పటిష్ట కార్యచరణ ద్వారా ముందుకు పోతుందని దానికి అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉందని, జిల్లాలోని ఆరోగ్య కేంద్రాలను పటిష్టంగా పర్యవేక్షిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన, మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ ఉమా గౌరీ , మెడికల్ ఆఫీసర్ సుష్మ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాన్‌స్టిక్ పాత్రల్లో వంట చేస్తే ఎంత డేంజరో తెలుసా? పాత తరం పద్ధతులే బెటర్



శరీరంలోని పోషకాహార లోపాలను పూరించడం నుంచి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడం వరకు ఆహారం కీలక పాత్ర వహిస్తుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. శరీరానికి వచ్చే వ్యాధుల్లో 56 శాతం తప్పుడు ఆహార అలవాట్ల వల్లే వస్తున్నాయట. సమతుల్య ఆహారంపై మార్గదర్శకాలను కూడా ప్రచురించింది. నాన్ స్టిక్ పాత్రల్లో ఆహారం వండడం వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆరోగ్యం కోసం మట్టి పాత్రల్లో వండాలని సిఫార్సు చేస్తోంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలో వివిధ వ్యాధులకు కారణమవుతుంది. అయితే మనం ఏ పాత్రలు వాడుతున్నామో, ఎలా వండుతున్నామో ఓసారి గమనించుకోవాలి. నేటి కాలంలో ప్రతి ఒక్కరి ఇళ్లలో నాన్‌స్టిక్ పాత్రల వినియోగం పెరిగిపోయింది. పాతకాలం నాటి మట్టి పాత్రల వాడకం తగ్గిపోయింది. ఆరోగ్యాన్ని పాడుచేసే నాన్‌స్టిక్ వంటసామాన్లు వంటగది నిండా ఆక్రమించాయి. కానీ నాన్ స్టిక్ పాత్రలను ఉపయోగించకుండా దూరంగా ఉండాలని సూచిస్తోంది. బదులుగా పర్యావరణ అనుకూలమైనది మట్టి కుండలలో వండాలని సిఫార్సు చేస్తుంది. అలాగే ప్రోటీన్ సప్లిమెంట్లకు కూడా దూరంగా ఉండాలని చెబుతోంది. అవి నిర్జలీకరణం, పోషకాల అసమతుల్యతకు కారణమవుతాయట. వీటివల్ల మూత్రపిండాలు కూడా దెబ్బతింటాయని పేర్కొంది. సమతుల్య ఆహారంపై దృష్టి పెట్టాలని, మట్టిపాత్రల్లో వంట చేయడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని చెబుతోంది. మట్టిపాత్రల్లో వంట చేయడం వల్ల ఏంటీ ప్రయోజనం? తక్కువ నూనె మట్టి పాత్రల్లో రుచిగా వంట చేయొచ్చు. అలాగే ఆహారం సహజ రుచి అలాగే ఉంటుంది. ఆహారంలోని పోషక విలువలు కూడా కోల్పోవు. బదులుగా ఆహారంలో యాసిడ్ పరిమాణం తగ్గుతుంది. మట్టి కుండల్లో వండడం వల్ల కూడా ఆహారంలోకి హానికరమైన రసాయనాలు విడుదల కావు. ఇలాంటి ఆహారం తింటే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. నిజానికి, అధిక ఉష్ణోగ్రతల వద్ద నాన్‌స్టిక్ పాన్‌లలో వండడం వల్ల విషపదార్థాలు విడుదలవుతాయి. ఇది ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్యానికి కారణం అవుతుంది. అందుకే మట్టి కుండలలో వండాలని అలాగే స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలలో ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తోంది. అవి ఇతర లోహ పాత్రల కంటే మన్నికైనవి. పరిశుభ్రమైనవి. పైగా శుభ్రం చేయడం కూడా చాలా సులభం. వంటేకాదు మట్టి లేదా సిరామిక్ పాత్రల్లో ఆహారాన్ని భుజించవచ్చు కూడా.

# యూరియా కొరత బిఆర్ఎస్ సృష్టిస్తుంది

**- ఎమ్మెల్యే కవ్వంపల్లి**



**గన్నేరువరం, ఆగస్టు 8,(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలకేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి పంపిణీ చేశారు. దుకాణాల యజమానులను బెదిరింపులకు గురిచేసి ఎక్కువ బస్తాలు తీసుకెళ్తూ ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం బిఆర్ఎస్ నాయకులే చేస్తున్నారని ఆరోపిస్తూ యూరియా కొరత లేదని అవసరమైన ఎరువులను అందజేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. సీఎంఆర్ఎఫ్ పథకం నిరుపేదల వైద్యానికి ఆర్థికంగా అండగా నిలిచి ఆదుకుంటుందని ప్రజల ఆశలకు అనుగుణంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పనిచేస్తున్నదని ఎమ్మెల్యే కవ్వంపల్లి తెలిపారు.కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్,మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముస్కు ఉపేందర్ రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, బుర్ర శ్రీధర్ గౌడ్, మాతంగి అనిల్, బొడ్డు సునిల్, బొడ్డు మల్లేశం, కొండాపూర్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, బుర్ర తిరుపతి గౌడ్, సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి.. అనుబంధాలను పెంపు చేస్తూ.. బాధ్యతలను గుర్తు చేసే వేడుక

**భారతీయ జనతా పార్టీ రామగిరి మండల అధ్యక్షులు కొండు లక్ష్మణ్**





**రామగిరి, ఆగస్టు 08(ది క్రైమ్ న్యూస్):** రక్షబంధన్ పండగనీ పురస్కరించుకొని ముందస్తుగా భారతీయ జనతా పార్టీ రామగిరి మండల అధ్యక్షులు కొండు లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున రక్షా బంధన్ కార్యక్రమం స్థానిక విద్యా సంస్థ లలో వాణి సెకండరీ హై స్కూల్ , కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని, విద్యార్థులకు,ఉపాధ్యాయులకు, రాఖీలు కట్టి మీరు మాకు రక్ష మేము మీకు రక్షా, మనమందరం దేశానికి రక్ష అనే నినాదంతో రక్షా బంధన్ నిర్వహించడం జరిగింది.సంస్కృతి సాంప్రదాయాలకు మరియు అన్నా-చెల్లెకు అక్క-తమ్మునికి ఉన్న సంబంధానికి రక్షాబంధన్ ప్రతీక అని అన్నారు. దేశంలోని ప్రతి బాలికకు యువతులకు ప్రతి ఒక్క యువకుడు రక్షణగా ఉండాలని దేశంలో బాలికలపై మరియు యువతులపై జరుగుతున్న కొన్ని అసాంఘిక సంఘటనలు జరగకుండా ఉండాలంటే ప్రతి ఒక్క పౌరుడు బాధ్యతగా స్వీకరించి ఇలాంటి చర్యలు మరల పునరావృతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడు పై ఉందని అన్నారు. ముందస్తుగా దేశ రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల జనరల్ సెక్రెటరీ తొట్ల రాజు, మద్దూరి సాగర్, ఉపాధ్యక్షుడు నాంసాని మహేష్, ఆర్ఎస్ఎస్ ఏకలభ్యన్ పులి రాజు, యువ నాయకులు కందుల రమేష్, మైదం సందీప్, రసమల్ల ఆదిత్య, కలికోట రాము, పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# మడిపల్లిలో కార్డాన్ సెర్చ్...








**జమ్మికుంట ఆగస్టు 8 (ది క్రైమ్ న్యూస్):** మడిపల్లి గ్రామంలో పోలీసులు కార్డాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పర్సనల్ డిసిపి పి వెంకట్ రమణ మాట్లాడుతూ పాత నేరస్థులు ఎవరైన ఉంటే వారిని ఐడెంటిఫై చేయడం తో పాటు అక్రమ కార్యకలాపాలు అరికట్టడానికి కార్డాన్ సెర్చ్ లాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. మడిపల్లి గ్రామంలో వేకువజామున ఇంటింటి సోదాలు నిర్వహించారు పోలీసులు అనుమానితులు కనబడితే వారి వివరాలు అడిగి తెలుసుకోవడం తో పాటు సరైన ధృవ పత్రాలు లేనీ 59 ద్విచక్ర వాహనాలు ఆక్రమం గా తరలిస్తున్న ఒక ఇసుక ట్రాక్టర్ ను స్వాధీన పడుకున్నారు. అనంతరం గ్రామస్తులకు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు , మహిళలకు భరోసాగా నిలిచే కార్యక్రమాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కరీంనగర్ అడిషనల్ డి సి పి వెంకటరమణ, హుజురాబాద్ ఏ సి పి మాధవి, జమ్మికుంట సిఐ రామకృష్ణ, హుజురాబాద్ సిఐ కరుణాకర్ జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు యూనిస్ అహ్మద్ అలీ, సతీష్, తిరుపతి శేఖర్ రెడ్డి ల తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# విశ్వజి

# డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టు పెట్టే సూపర్ ఫుడ్ !..



**రోజూ ఇలా ట్రై చేయండి.**

క్వినోవా అనేది పోషకాలను సమృద్ధిగా కలిగి ఉన్న శక్తివంతమైన ధాన్యం. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికా దేశాల్లో ఉత్పత్తి అవుతూ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్నేహితుల ఆహార జాబితాలో కీలకంగా మారింది. ఇది ప్రోటీన్లకు గొప్ప మూలంగా ఉండటమే కాకుండా, గ్లూటెన్-ఫ్రీ ఫుడ్ కావడం వల్ల చాలా మంది ఆరోగ్య పరంగా దీన్ని తమ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. దీన్ని ఆహారంగా చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్వినోవా యొక్క ప్రయోజనాలు: క్వినోవాలో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది శాకాహారులు మరియు శాఖాహారులకు ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది . మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. క్వినోవాలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ %దీ% వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ధాన్యంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. క్వినోవా గ్లూటెన్ రహితమైనది, కాబట్టి ఇది ఉదరకుహర వ్యాధి లేదా గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది మనకు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన మనం తక్కువ ఆహారం తీసుకుంటాము మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్వినోవాలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్వినోవాలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది , డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని అన్నం లాగా వండుకోవచ్చు లేదా సలాడ్లు, సూప్‌లు, స్మూతీలలో కూడా ఉపయోగించవచ్చు. దీనిని పిండిగా కూడా ఉపయోగించి రొట్టెలు, ఇతర బేక్ చేసిన వస్తువులను తయారు చేయవచ్చు. ఇది పోషకమైన ఆరోగ్యకరమైన ఆహారం. దీనిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



## పీరియడ్స్ నొప్పి బాధిస్తుందా? తగ్గాలంటే ఈ చిట్కాలు పాటించండి

పీరియడ్స్ సమయంలో అమ్మాయిలు, మహిళలు చాలామంది విపరీతమైన నొప్పితో బాధపడుతూ ఉంటారు. సాధారణంగా గర్భాశయంలో సంకోచాల కారణంగా పీరియడ్స్ నొప్పి వస్తుంది. ఈ సంకోచాలు గర్భాశయం లోపలి పొర అయిన ఎండోమెట్రియం కదలికల వల్ల జరుగుతుంది. రుతుస్రావం సమయంలో రక్తం బయటకు రావడానికి ఈ కదలికలు ఉపయోగపడతాయి. పీరియడ్స్ నొప్పి.. కారణాలివే ఈ సంకోచాలు నొప్పిని, వాపును కలిగిస్తాయి. ప్రోస్టాగ్లాండిన్స్ అనే రసాయనాల కారణంగా ఈ సంకోచాలు ఏర్పడతాయి. కొన్ని సందర్భాలలో ఈస్ట్రోజన్ మరియు ప్రొజెస్టిరాన్ స్థాయిలలో మార్పుల వల్ల, హార్మోన్ల అసమతుల్యత కారణంగా కూడా పీరియడ్స్ నొప్పి వస్తుంది. నిద్రలేమి, ఒత్తిడి, ఆహారపు అలవాట్ల కారణంగా కూడా జీవనశైలితో పీరియడ్స్ నొప్పి వస్తుంది. గర్భాశయ సమస్యలు ఉన్నవారికి కూడా పీరియడ్స్ సమయంలో నొప్పి వస్తుంది. పీరియడ్స్ నొప్పి తగ్గాలంటే ఇలా చెయ్యండి ఇక పీరియడ్స్ నొప్పిని సహజంగా తగ్గించడానికి కొన్ని చిట్కాలు ఉన్నాయి. ఈ చిట్కాలతో ఎటువంటి మందుల అవసరం లేకుండా పీరియడ్స్ నొప్పిని తగ్గించుకోవచ్చు. కడుపు పైన, నడుము పైన హీట్ ప్యాక్ పెట్టడం, వేడినీళ్ల వాటర్ బాటిల్ తో మసాజ్ చేయడం వంటి వాటితో పీరియడ్స్ నొప్పిని తగ్గించవచ్చు. అంతేకాదు వెచ్చని నీళ్ళతో స్నానం చేయడం కూడా నొప్పి నుండి ఉపశమనం కల్పిస్తుంది. ఇవి తింటే, ఇలా చేస్తే పీరియడ్స్ నొప్పి నుండి ఉపశమనం ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఉన్న ఆహారాలు తినడం, అల్లం టీ లేదా దాల్చిన చెక్క టీ తాగడం వల్ల పీరియడ్స్ నొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. కొబ్బరి నూనెతో ను, లేదా లావెండర్ ఎసెన్షియల్ ఆయిల్ తోను కడుపు, నడుముకు సున్నితంగా మసాజ్ చేసిన పీరియడ్స్ నొప్పి నుండి ఉపశమనం కలుగుతుంది. %ూశ్రీంశీ =ఝ౦% ఈ అలవాట్లతో శరీరంలో చెడు కొలెస్ట్రాల్.. అలెర్ట్ ఈ చర్యలతో పీరియడ్స్ నొప్పికి చెక్ ఒత్తిడిని తగ్గించేలా సున్నితమైన వ్యాయామాలు చేయడం వల్ల, ధ్యానం చేయడం వల్ల పీరియడ్స్ నొప్పి తగ్గుతుంది. తగినంత నీరు తాగడం వల్ల బాడీ డీహైడ్రేషన్ నుండి బయటపడుతుంది. ఫలితంగా పీరియడ్స్ సమయంలో నొప్పి తగ్గుతుంది. ఇక బాలాసనం, సుప్త మత్స్యాసనం వంటి తేలికపాటి యోగాసనాలు చేయడం వల్ల, తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల కూడా పీరియడ్స్ నొప్పి తగ్గుతుంది.

## ఫ్రెంచ్ ఫ్రైస్ లాగిస్తున్నారా మధుమేహం కొని తెచ్చుకున్నట్లే..!!




ఫ్రెంచ్ ఫ్రైస్. అందరూ ఇష్టపడి తినే ఫాస్ట్ ఫుడ్. వేగంగా తయారై టేబుల్‌పైకి వచ్చేది ఫ్రెంచ్ ఫ్రైస్. ఇవి బంగాళదుంపల నుండి తయారవుతాయి. రుచిగా.. ఇష్టంగా తీసుకునే ఈ ఫ్రెంచ్ ఫ్రైస్ పరిమితికి మంచి తీసుకుంటే మధుమేహం తో పాటుగా ఎన్నో అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకోవ టమేనని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ప్రతి వారం మూడు ప్లేట్ల ఫ్రెంచ్ ఫ్రైస్ తినడం వల్ల టైప్-2 డయాబెటిస్ రిస్క్ 20% పెరుగుతుందని ఒక పరిశోధన వెల్లడించింది. అందరూ అమితంగా ఇష్టపడే ఫ్రెంచ్ ఫ్రైస్ ఎక్కువగా తీసుకోవటం వలన వచ్చే అనారోగ్య సమస్యల పైన తాజా అధ్యయన నివేదిక కీలక అంశాలను వెల్లడించింది. ఉడికించిన లేదా కాల్చిన బంగాళాదుంపలతో అంత ప్రమాదం ఉండదని బ్రిటిష్ మెడికల్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం పేర్కొంది. హార్వర్డ్, కేంబ్రిడ్జి యూనివర్సిటీల పరిశోధకులు ప్రారంభంలో మధుమేహం, గుండె జబ్బులు, క్యాన్సర్ లేని దాదాపు 2 లక్షల మంది నుంచి 40 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. ఈ క్రమంలో 40 ఏళ్ల తర్వాత వారిలో 22,300 మంది డయాబెటిస్ బారినపడినట్టు నివేదికలో వెల్లడించారు. వారానికి మూడుసార్లు ఫ్రెంచ్ ఫ్రైస్ తీసుకున్న వారిలో మధుమేహం ప్రమాదం 20 శాతం పెరిగిందని గుర్తించినట్టు వెల్లడించారు. అయితే కాల్చిన లేదా ఉడికించిన బంగాళాదుంపలు తీసుకున్న వారికి ఎలాంటి సమస్యా ఎదురు కాలేదని పేర్కొన్నారు. బంగాళాదుంపల స్థానంలో తృణధాన్యాలను ఆహారంగా ఇచ్చినప్పుడు మధుమేహం వచ్చే ప్రమాదం తగ్గినట్టు కనుగొన్నారు. కానీ.. బంగాళాదుంపలకు బదులుగా అన్నం తీసుకున్నవారిలో మధుమేహం ప్రమాదం పెరిగినట్టు గుర్తించారు. అయితే, పీచు, విటమిన్ సి, మెగ్నీషియం వంటి అనేక పోషకాలు బంగాళదుంపలో ఉంటాయి. అవి అధిక మొత్తంలో స్టార్చ్ కలిగి ఉంటాయి. వాటి గ్లైసెమిక్ సూచిక కూడా చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది.

## ఆలివ్ ఆయిల్ వాడుతున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి!

ఆలివ్ ఆయిల్ అనేది ఆలివ్ పండ్ల నుండి తీయబడిన ఒక రకమైన వంట నూనె. ఇది మధ్యధరా ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను చేకూరుస్తుంది, కానీ కొన్ని సందర్భాల్లో ఇది దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుంది. ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా లేదా తప్పుగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కలిగిస్తుంది. ప్రతి రోజూ ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుందాం.. 1. అలర్జీ ప్రతిచర్యలు: కొంతమందికి ఆలివ్ ఆయిల్‌కు అలర్జీ ఉండవచ్చు. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఒకవేళ మీకు ఆలివ్ ఆయిల్ తీసుకున్న తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే దానిని తీసుకోవడం ఆపేసి వైద్యుని సంప్రదించాలి. 2. జీర్ణ సమస్యలు: ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు కలుగుతాయి. ఆలివ్ ఆయిల్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, జీర్ణ సమస్యలు ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది. 3. చర్మ సమస్యలు: ఆలివ్ ఆయిల్ అన్ని రకాల చర్మాలకు సరిపోదు. ముఖ్యంగా జిడ్డు చర్మం కలిగినవారు ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా వాడటం వల్ల మొటిమలు వచ్చే అవకాశం ఉంది. ఆలివ్ ఆయిల్‌లో ఒలియిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మం యొక్క సహజ నూనెలను తొలగించగలదు, దీనివల్ల చర్మం పొడిబారవచ్చు. కాబట్టి, మీ చర్మ తత్వాన్ని బట్టి ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం మంచిది.



# మార్కెట్

## సూచీలకు చివర్లో లాభాలు

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. భారత్‌పై 50 శాతం వరకు ప్రతీకార సుంకాలను విధించనున్నట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికతో కుప్పకూలిన మార్కెట్లు చివరి గంటలో మదుపరులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు ఊపందుకోవడంతో సెన్సెక్స్ 80 పాయింట్లు లాభపడింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీ ఒక దశలో 80 వేల కీలక మైలురాయిని కోల్పోయి 79,811 పాయింట్ల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివర్లో తిరిగి కోలుకొని 79 పాయింట్లు లాభపడి 80,623.26 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 21.95 పాయింట్లు అందుకొని 24,596.25 వద్ద నిలిచింది. కేవలం ఐటీ రంగానికి చెందిన టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, మారుతి, టాటా స్టీల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, అదానీ పోర్ట్స్, ట్రెంట్, టాటా మోటర్స్, హెచ్‌యూఎల్, ఎన్‌టీపీసీలు నష్టపోయాయి. రంగాలవారీగా ఐటీ, హెల్త్‌కేర్, టెక్నాలజీ, వాహన రంగ షేర్లు లాభపడగా%ెౌ%టెలికాం, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్, పవర్, ఇండస్ట్రియల్స్ రంగ షేర్లు నష్టపోయాయి.



## నష్టాల్లో స్టాక్ మార్కెట్‌లు.. 80 వేల మార్క్ దిగువకు సెన్సెక్స్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల భయాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్లు శుక్రవారం కుప్పకూలాయి. అన్ని రంగాల్లోనూ అమ్మకాలు ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ఫలితంగా సెన్సెక్స్ 80 వేల మార్క్ దిగువకు పడిపోయింది. మూడు నెలల కనిష్ఠ స్థాయికి చేరింది. దాంతో మదుపరులు తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. భారత్ నుంచి వచ్చే దిగుమతులపై సుంకాలను 50 శాతానికి పెంచామని, రష్యా నుంచి చమురు దిగుమతిని కొనసాగిస్తే ఈ టారిఫ్‌లను మరింత పెంచుతామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ప్రకటన దేశీయ మార్కెట్లలో తీవ్ర ఆందోళనకు దారితీసింది. దీనికితోడు విదేశీ సంస్థాగత మదుపరులు నిరంతరాయంగా తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడంతో పతనం మరింత తీవ్రమైంది. శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ 765.47 పాయింట్లు నష్టపోయి 79,857.79 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సమయంలో ఒక దశలో 79,775 పాయింట్ల కనిష్ఠ స్థాయిని కూడా తాకింది. అదేవిధంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 232 పాయింట్లు కోల్పోయి 24,363.30 వద్ద ముగిసింది. రియల్టీ, మెటల్, ఆటో, ఐటీ, బ్యాంకింగ్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. సెన్సెక్స్ బాస్కెట్‌లో భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, రిలయన్స్, ఇన్ఫోసిస్ వంటి ప్రధాన షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎన్‌టీపీసీ, టైటాన్ లాంటి కొన్ని షేర్లు మాత్రమే లాభపడ్డాయి. కాగా వరుసగా ఆరో వారంలోనూ మార్కెట్లు నష్టాలతోనే ముగియడం గమనార్హం.

## రిలయన్స్ రిటైల్ 33 వేల కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ : రిలయన్స్ రిటైల్ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.33,696 కోట్ల పెట్టుబడులు పెట్టింది. రిటైల్ రంగాన్ని మరింత విస్తరించడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపర్చడానికి అంతక్రితం ఏడాది పెట్టిన పెట్టుబడులతో పోలిస్తే 37 శాతం పెరిగినట్టు తన వార్షికపు నివేదికలో వెల్లడించింది. దీంతో రిటైల్ అవుట్‌లెట్ల సంఖ్య 20 వేలకు చేరువైంది. రూ.3.30 లక్షల కోట్ల స్థాయిలో ఉన్న దేశీయ రిటైల్ రంగంలో రిలయన్స్ రెండంకెల వృద్ధిని నమోదు చేసుకుంటున్నట్టు ఆర్ఐఎల్ చైర్మన్ ముకేశ్ అంబానీ చెప్పారు. మరోవైపు, రిలయన్స్ టెలికాం వెంచర్ జియో దూకుడు పెంచింది. 6జీ సేవలు అందించడానికి అవసరమైన టెక్నాలజీపై దృష్టిసారించింది.



# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

### పాడేరులో పెద్ద ఎత్తున గిరిజన సంక్షేమ కార్యక్రమాలు

### హాజరువుతున్న సిఎం చంద్రబాబు నాయుడు

### గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

### రూ.7557 కోట్లు షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద ఖర్చు



అమరావతి,ఆగస్ట్ 8 : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే గిరిజన ప్రాంతాల్లో నూతన అధ్యాయం ఆరంభమైంది. ఏజెన్సీ జిల్లాల్లోని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోంది. గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరులో జరుగనున్న కార్యక్రమానికి హాజరు కానున్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ- కృత్రిమ మేధస్సు, ఆదివాసీల భవిష్యత్తు అనే థీమ్ తో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ గిరిజన దినోత్సవ నిర్వహణకు పిలుపునిచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా పాడేరులో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. పాడేరు మండలం వంజంగి గ్రామంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం స్థానిక గిరిజన సంప్రదాయ వేడుకలకు హాజరు అవుతారు. ఆదివాసీల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో సీఎం మాట్లాడనున్నారు. ఆ తర్వాత లగిసపల్లె వద్ద ఏర్పాటు- చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం అక్కడి నుంచే శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టులకు సంబంధించిన అంశంపై సీఎం సమక్షంలో ఎంఓయూలను కుదుర్చుకోనున్నారు. అనంతరం కొద్దిసేపు పార్టీ శ్రేణులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలు, ఆవాసాలను ఏజెన్సీలోని ప్రధాన కేంద్రాలు, ఇతర మైదాన ప్రాంతాలతో అనుసంధానించేలా ప్రభుత్వం రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల్లో వేగం పెంచింది. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు నిర్మాణంతో పాటు- ఆదివాసీల ప్రాంతాలు, నివాసాలకు కనెక్టివిటీ- కోసం రూ. 2404 కోట్లు- ఖర్చు చేయనుంది. వచ్చే ఐదేళ్లలో 2075కు పైగా గిరిజన గ్రామాలకు, నివాసాలను రోడ్లు, వంతెనలతో అనుసంధానించాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రోడ్ల కారిడార్లను రూ.41 కోట్లతో చేపట్టనుంది. ఐటీ-డీఏ చింతూరులో కమ్యూనిటీ- హెల్త్ సెంటర్ ను 50 నుంచి 100 పడకల ఆస్పత్రికిగా మార్చడంతో పాటు- సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్ పురం, శ్రీశైలం ఐటీ-డీఏ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ- ఆస్పత్రుల నిర్మాణాల కోసం రూ.50 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలోనే నిర్మాణాలు పూర్తై ఆస్పత్రులు అందుబాటు-లోకి రానున్నాయి. పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే జల్ జీవన్ మిషన్ కింద గిరిజన ప్రాంతాల్లోని 13,816 ఆవాసాలకు మంచినీటి సరఫరా కోసం రూ. 2,373 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టింది. 2026 నాటికి ఈ పనులు పూర్తి చేసి ఆదివాసీలు అందరికీ తాగునీరు అందుబాటు-లోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డీఎస్సీ సహా వివిధ పోటీ- పరీక్షలకు గిరిజన యువతీ యువకులు సన్నద్ధం చేసేందుకు విశాఖ, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చేందుకు రూ.150 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 520కి పైగా రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చటం కోసం రూ.150 కోట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. 520కి పైగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం రూ.64 కోట్లను కూడా ప్రభుత్వం వ్యయం చేస్తోంది. పార్వతీపురం మన్యంలో పూర్ణపాడు-కొమరాడ మధ్య నాగావళి నదిపై రూ.10 కోట్లతో హై లెవల్ వంతెనను కూడా చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరోవైపు ప్రపంచ బ్రాండ్ గా మారిన అరకు కాఫీని మరింత విస్తరించేందుకు వీలుగా మన్యంలో ఎ÷-లాంటేషన్ను పెంచేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. కాఫీ పల్పింగ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు- చేయటంతో పాటు- ప్లాంటేషన్ విస్తరణ కోసం రూ.202 కోట్లను ప్రభుత్వం వ్యయం చేయనుంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా పర్యాటక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అధికారంలోకి వచ్చిన అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.7557 కోట్ల రూపాయల్ని షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద కూటమి ప్రభుత్వం వ్యయం చేసింది. అధికారంలోకి వస్తూనే రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.82 లక్షల మంది గిరిజన కుటు-ంబాలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అందిస్తోంది. అలాగే త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఇంటిపై సౌరఫలకాలను ఏర్పాటు- చేసేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,77,051 మంది గిరిజనులకు ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం రూ.1,595 కోట్లు- ఖర్చు చేస్తోంది. అలాగే తల్లికి వందనం పథకం ద్వారా 4,86,803 మంది గిరిజన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.642 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.

# తిరుపతిలో ఆటో డ్రైవర్ దాష్టీకం

### భక్తుడిపై దాడి చేసిన వీడియో వైరల్

తిరుమల,ఆగస్ట్ 8 : తిరుపతి రైల్వే స్టేషన్‌లో భక్తుడిపై ఆటో డ్రైవర్లు దాడికి దిగిన ఘటన భక్తుల్లో భయాందోళనలకు కారణమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి భక్తులు తిరుమలకు వెళు తుంటారు. అలాంటి భక్తులపై శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు వెళ్లే ఫ్రీ బస్ స్టాప్ వద్ద ఆటోడ్రైవర్లు దాడికి దిగారు. దాడికి సంబంధించిన వీడియోని కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ చెప్పిన రేటుకు భక్తుడు నిరాకరించడంతో అతడిపై తీవ్రంగా దాడి చేసి ఆటో డ్రైవర్లు గాయపరిచారు. తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఆటోవాలాల దందా రోజురోజుకు పెరిగిపోతుండటం గమనార్హం. తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ల దగ్గర నుంచి శ్రీవారి మెట్టు- వరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు- చేసింది. అయితే సమాచార లోపం కారణంగా భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఉచిత బస్సుల -టైమింగ్ భక్తులకు తెలియకపోవడంతో శ్రీవారి మెట్టు- వరకు భక్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

# ఎపిలో నలుగురు జడ్జిలకు పదోన్నతి

అమరావతి,ఆగస్ట్ 8 : కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. పలు హైకోర్టుల్లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న 16 మందిని పూర్తికాలం న్యాయమూర్తులుగా నియమిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ సహా.. ఆరు రాష్ట్రాల్లో న్యాయమూర్తులకు పదోన్నతి ఇస్తూ.. కేంద్ర న్యాయశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఏపీ హైకోర్టులో నలుగురు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి లభించింది. జస్టిస్ హరనాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లకు పూర్తి స్థాయి జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది. 16 మంది హైకోర్టు జడ్జిలకు పదోన్నతి కల్పించాల్సిందిగా సుప్రీం కోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు చేసింది. అందుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో తాజాగా కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

# తల్లీకూతరు దారుహత్య

జనగామ,ఆగస్ట్8 : జనగామ జిల్లా, జఫర్‌గడ్ మండలం, తమ్మడపల్లిలో తల్లీకూతురు గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో దారుణ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. అందరితోను కలివిడిగా ఉండే వారు హఠాత్తుగా హత్యకు గురికావడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా సంచలనం రేపింది. తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన గాలి రాణమ్మ (60), ఆమె తల్లి తుమ్మ అన్నమ్మ (90) ఇద్దరు గుర్తు తెలియని దుండగుల చేతిలో గురువారం రాత్రి హత్యకు గురయ్యారు. ఇంట్లో నిద్రిస్తున్న వారిద్దరిని నిద్రలేపిన దుండగులు హత్య చేసి, అక్కడి నుండి పారిపోయారు. శుక్రవారం ఉదయం ఈ హత్యోదంతం వెలుగు చూసింది. తమ్మడపల్లి (ఐ)కి చెందిన గాలి జార్జిరెడ్డి మొదటి భార్య సుందరి. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుందరి అనారోగ్యంతో మృతి చెందిన అనంతరం జార్జిరెడ్డి దేవరుప్పుల మండలం, నీర్మాలకు చెందిన తన భార్య స్వంత సోదరి రాణమ్మను రెండో భార్యగా వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కూతురు ఉంది. జార్జిరెడ్డి 25 సంవత్సరాల క్రితమే మృతి చెందాడు. దీంతో గ్రామంలో ఒంటరిగా ఉంటున్న రాణమ్మ తన తండ్రి మృతి చెందడంతో తల్లి అన్నమ్మను తమ్మడపల్లి (ఐ)కి తీసుకువచ్చి పోషించుకుంటోంది. గత ఏడేళ్లుగా ఇద్దరూ కలిసి ఉంటు-న్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న తల్లీకూతురు గుర్తు తెలియని దుండగుల చేతిలో హత్యకు గురికావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం తెలుసుకున్న వర్ధన్నపేట్ ఎసిపి అంబటి నర్సయ్య, సిఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ బి రామ్ చరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. శవ పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వరంగల్ ఎంజిఎంకు తరలించారు. కాగా, వీరిద్దరి హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## ట్రంప్ సుంకాల వడ్డంపు వేళ

### పుతిన్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

### ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితిపై చర్చించినట్లు ప్రకటన

న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 : ట్రంప్ సుంకాల బెదరింపుల వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను ప్రధాని మోదీకి పుతిన్ వివరించినట్లు- తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు- ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు తమ నిబద్ధతను చాటుకున్నట్లు- తెలిసింది. ఈ సందర్భంగా 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఈ ఏడాది చివరలో భారత్‌లో పర్యటించాలని పుతిన్‌కు ప్రధాని మోదీ ఆహ్వానించినట్లు- పీఎంవో వెల్లడించింది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ ప్రధాని మోదీ పుతిన్‌తో సంభాషించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇకపోతే ఇదే అంశంపై చర్చించేందుకు పుతిన్‌తో భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఇప్పటికే మాస్కోలో ఉన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

విజయనగరం,ఆగస్ట్8 : వర్షాకాలం నేపథ్యంలో అపరిశుభ్రత వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సూచించారు. వర్షాకాలంలో తరచూ జలుబు, మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, డెంగ్యూ, ఎలర్జీ, చికెన్‌గున్యా, ఆయాసం, శ్వాసకోశ వ్యాధులతో పాటు విరేచనాలు కూడా అవుతాయన్నారు. అలాగే ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వాటిని గుర్తించి తక్షణం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులను సంప్రదించాలన్నారు. మలేరియా వస్తే చలి జ్వరం వస్తూ ఉంటుంది. డెంగ్యూ సోకితే అధిక ఉష్ణోగ్రత, తలనొప్పి, కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. టైఫాయిడ్ వస్తే జ్వరం తగ్గదు. వాంతులు అవుతాయి. ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వల్ల చంకలో, గజ్జల్లో తామర వస్తుందని అన్నారు. ఇలాంటి లక్షణాలు గుర్తిస్తే స్థానికంగా వైద్యుల సహకారం తీసుకుని మందులు వాడాలని అన్నారు. వ్యాధులు దరిచేరకుండా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటితో పాటు పరిసరాల్లో వాడి పడేసిన కొబ్బరి బొండాలు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉన్నచోట దోమల లార్వా ఉత్పత్తి అవుతుంది. ప్రతి ఒక్కరూ చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే రోగాలకు దూరం కావచ్చున్నారు.

# జడ్పీటీసీ ఓటమి భయంలో వైకాపా

### అందుకే అరాచక కార్యక్రమాలకు తెర

### మండిపడ్డ మంత్రి సవిత

కడప,ఆగస్ట్ 8 : పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని మంత్రి సవిత అన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఇలాంటి పనులు చేసిందని అన్నారు. ఆనాడు ఎంత దారుణంగా రాక్షస పాలన చేశారో ప్రజలకు తెలుసన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైసీపీకి పులివెందుల జెడ్పీటీసీ ఓడిపోతామని భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించడం వైసీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమని మంత్రి సవిత విమర్శించారు. పోలీసులను అసభ్యకరంగా మాట్లాడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ నాయకులు పులివెందుల ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు పేర్కొన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌పై జగన్ దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పులివెందులలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. వివేకానంద రెడ్డి జయంతికి కుటు-ంబ సభ్యులు రావాలన్న భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తామే గెలుస్తామని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

# లిక్కర్ కేసులో జగన్ అరెస్ట్ ఖాయం

### ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు

రాజమండ్రి,ఆగస్ట్8 : లిక్కర్ కుంభకోణంలో జగన్ అరెస్ట్ ఖాయమని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో పెట్టుబడులు రాకూడదని జగన్ ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. మళ్లీ తానే అధికారంలోకి వస్తానన్న భ్రమలో జగన్ ఉన్నారని ఎద్దేవా చేశారు. జగన్ ఎప్పుడు అరెస్టు అవుతారో డేట్ చెప్పలేమని, అరెస్ట్ మాత్రం ఖాయమని తెలిపారు.గత 78 ఏళ్లలో ఎప్పుడులేని విధంగా కేంద్ర ప్రభుత్వం ఏపీకి పూర్తి సహకారం అందిస్తుందని బీజేపీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. కూటమి ప్రభుత్వం హయాంలో ఏపీ అభివృద్ధి పథంలో ముందుకెళ్తుందని అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు తనను ఓడించినందుకు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కాకూడదనే మనస్తత్వంతో మాజీ సీఎం జగన్ ఉన్నారని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఆరోపించారు. లిక్కర్ కేసు నిందితులు బిగ్‌బాస్ ఎవరో చెప్పినట్లు-గా సిట్ వద్ద వీడియో ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. అప్పట్లో చంద్రబాబుని ఎలాంటి ఆధారాలు లేకుండా అరెస్టు చేశారని గుర్తు చేశారు. వైసీపీ మునిగిపోయే నావ, అందుకే ఆ పార్టీ కార్యక్రమాల్లో సీనియర్ నేతలు పాల్గొనడం లేదని ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు.

# అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా అరెస్ట్

### జల్సాలకు అలవాటుపడి గంజాయి అమ్మకాలు

నల్లగొండ,ఆగస్ట్8 : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా గుట్టు-ను నల్లగొండ జిల్లా, మిర్యాలగూడ పోలీసులు. రట్టు- చేశారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న పది మంది నిందితులను అరెస్టు చేసినట్లు- మిర్యాలగూడ డిఎస్‌పి రాజశేఖర్‌రాజు తెలిపారు. శుక్రవారం మిర్యాలగూడలో ఏర్పాటు- చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా మిర్యాలగూడ ప్రాంతంలో రెండుచోట్ల గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య సిబ్బందితో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, పల్నాడు జిల్లా, వెల్దుర్తి మండలం, ఉప్పలపాడు గ్రామానికి చెందిన భూక్య హనుమాన్ నాయక్, సింగార కాటం రాజులను పట్టుకున్నారు. వారి వద్ద నుండి 5 కెజిల 200 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. మిర్యాలగూడ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో సిఐ సోమనర్సయ్య ఆధ్వర్యంలో నరసరావుపేట జిల్లా, కారంపూడికి చెందిన మద్దూరు చంటిని పట్లుకున్నట్లు- తెలిపారు. వీరి వద్ద నుండి 2 కెజిల 200 గ్రాముల గంజాయిని పట్టు-కుని సీజ్ చేశారు.వీరు గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు-పడి, ఒక గ్రూప్‌గా ఏర్పడి, జల్సాల కోసం ఒడిశా రాష్ట్రానికి చెందిన ఆనంద్‌గురు నుండి గంజాయి కొనుగోలు చేసి అధిక ధరకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడకు చెందిన షేక్ రియాజ్, మహ్మద్, అర్షత్ అయూబ్, మహమ్మద్ సలీం అక్తర్, మహ్మద్ జునైద్ అలీ, షేక్ అఫ్రోజ్, కుర్ర సందీప్, మహమ్మద్ సోహేల్, మహమ్మద్ నజీరుద్దీన్, బాబా షేక్ సమీర్, మహమ్మద్ సమీర్, ఖానాపురం శరత్ అనే వ్యక్తులు పరిచయం కాగా, వీరు కూడా గంజాయిని బలిమెల నుండి తీసుకువచ్చి అమ్ముతున్నారు. వారినుండి మిర్యాలగూడకు చెందినవారు గంజాయి కొని ఇతరులకు అమ్ముతున్నారని వెల్లడించారు.ఈ క్రమంలో వీరు రెండు గ్రూపులుగా విడిపోయి బైక్, కారులో మిర్యాలగూడ పట్టణ పరిధిలో కస్టమర్లకు అందజేస్తున్నారని నమ్మదగిన సమాచారం మేరకు రూరల్, టూటౌన్ పోలీసులు పట్టు-కున్నారు. వారి వద్దనుండి కారు, మూడు మోటార్ సైకిళ్లు, 14 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అందులో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారు.ఈ కేసును ఛేదించిన టూటౌన్ సిఐ సోమ నర్సయ్య, మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య, టౌటౌన్ ఎస్ఐ రాంబాబు, హెడ్ కానిస్టేబుల్ యాదగిరిరెడ్డి, కానిస్టేబుల్ కూర బాలకృష్ణ, సిబ్బంది అక్బర్ బాషా, లక్ష్మయ్య, రాజశేఖర్, సమాది వెంకన్న, మహేష్, సైదులు, నాగరాజు, రాములు నాయక్‌ను అభినందించారు.

# ఆదాయపు పన్ను చట్టంపై పునరాలోచన

### పూర్తి అధ్యయనం తరవాత ప్రవేశ పెట్టే యోచన

న్యూఢిల్లీ,ఆగస్ట్8 : ఆరు దశాబ్దాలుగా అమల్లో ఉన్న ఆదాయపు పన్ను చట్టం-1961 స్థానంలో కొత్త చట్టం తీసుకొచ్చేందుకు సిద్ధమైన కేంద్రం ఆదాయపు పన్ను నూతన బిల్లు 2025ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. అయితే, ఈ బిల్లును తాజాగా కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నట్లు తెలుస్తోంది. దీన్ని అప్‌డేట్ చేసి మళ్లీ పార్లమెంట్ లో ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు- సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ నూతన ఆదాయపు పన్ను బిల్లును ఈ ఏడాది ఫిబ్రవరి 13న కేంద్రం లోక్‌సభ లో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. దీనిపై విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ-కి పంపించారు. ఈ కమిటీ- దీన్ని అధ్యయనం చేసి జులై 21న తమ నివేదికను పార్లమెంట్‌కు సమర్పించింది. మొత్తం 4500 పేజీలతో కూడిన ఈ నివేదికలో ముసాయిదా బిల్లుకు 285 ప్రతిపాదనలు చేసింది. ఈ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం.. దానికి అనుగుణంగా కొత్త బిల్లును రూపొందించేందుకు సిద్ధమైంది. ఈ అప్‌డేటెడ్ బిల్లును ఆగస్టు 11న లోక్‌సభ ముందుకు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించినట్లు- సమాచారం. నూతన ఆదాయపు పన్ను బిల్లుకు సెలెక్ట్ కమిటీ- కొన్ని ప్రధాన సూచనలు చేసింది. ముఖ్యంగా ఇంటిపై ఆదాయం పొందుతున్న వారికి ఉపశమనం కలిగేలా కొన్ని ప్రతిపాదనలు సూచించినట్లు- తెలుస్తోంది. ప్రస్తుతం గృహ రుణ వడ్డీతో పన్ను మినహాయింపు ప్రయోజనాలు కేవలం సొంతింట్లో ఉంటున్న వారికి మాత్రమే వర్తిస్తున్నాయి. అలా కాకుండా సొంతింటిని అద్దెకు ఇచ్చిన సందర్భాల్లోనూ వడ్డీతో పన్ను మినహాయింపు కల్పించాలని కమిటీ- సూచించినట్లు- సమాచారం. ఇక, టీడీఎస్, టీసీఎస్ రీఫండ్లను కూడా సరళతరం చేయాలని కమిటీ- ప్రతిపాదనలు చేసింది. 1961లో రూపొందించిన ఆదాయపు పన్ను చట్టానికి, 66 బడ్జెట్‌లలో (రెండు మధ్యంతర బడ్జెట్లు- కలిపి) ఎన్నో సవరణలు జరిగాయి. దీంతో సంక్లిష్టంగా తయారైంది. పన్ను చెల్లింపుదార్లకు వ్యయాలూ పెరిగాయి. దీంతో ఈ చట్టాన్ని సమీక్షించి, సరళతరం చేస్తామని 2024 జులై బడ్జెట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఆ మేరకు కొత్త బిల్లును రూపొందించారు.

# పిడుగుపాటుకు ఎత్తిపోతల పైపులైన్ దిమ్మెలు నేలమట్టం

నాగర్‌కర్నూల్,ఆగస్ట్8 : కొల్లాపూర్ నియోజకవర్గం, పెంట్లవెల్లి మండల పరిధిలోని మెరుపులు ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు ఎంగంపల్లి తండా గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం పైపులైన్ దిమ్మెలు నేలమట్టం అయ్యాయి. ఈ మినీ ఎత్తిపోతల పథకాన్ని 1994లో నిర్మించారు. దీని ద్వారా ఎంగంపల్లి తండా మల్లేశ్వరం మంచాలకట్ట కొన్ని గ్రామాలకు దాదాపుగా 650 ఎకరాలకు సాగునీరు సరఫరా జరిగేది. ఎత్తిపోతల పథకం నిర్మించిన మొదలు కొన్నేళ్లపాటు- ఉపయోగంలో ఉన్నా చాలాకాలం నుంచి మోటార్లు రిపేరు అయ్యాయనే నెపంతో నిరుపయోగంగా మారి శిథిలావ్యవస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేపట్టి, మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు ఎంతో కాలం నుంచి కోరుతునన్నారు. కృష్ణానది చెంతన ఉన్న సాగుకు నీరు అందక రైతులు మాజీ ఎంఎల్‌లకు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు.


# మహిళలకు సిఎం రేవంత్ రాఖీ శుభాకాంక్షలు

హైదరాబాద్,ఆగస్ట్ 8 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు- మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీ-న్లు,ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.



# మళ్లీ లైన్‌లోకి వచ్చిన అనుపమ పరమేశ్వరన్

టిల్లు స్క్వేర్‌తో హోమ్లీ లుక్కు నుండి మేకోవర్ అయిన అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది డ్రాగన్‌తో ఓ మంచి శుభారంభాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల వచ్చిన జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చెరిపేసింది. -టైటిల్ వివాదం వల్ల సరైన ప్రమోషన్లు చేయక ఏదో రిలీజ్ చేశామంటే చేశాం అని తూతూ మంత్రంగా, వ్యవహారం సాగింది. దీని వల్ల కేరళలో చాలా గ్యాప్ తర్వాత వచ్చిన ఫిల్మ్ తన కెరీర్‌కు యూజ్ కాకుండా పోయింది. ఈ రిజల్ట్ ముందే ఊహించారేమో తెలుగులో కూడా రిలీజ్ చేయాలనుకుని చివరి నిమిషంలో వెనక్కు తగ్గారు మేకర్స్. అనుపమ పరమేశ్వర్ కు ఆఫర్ల కొదవ లేదు కానీ చేసిన సినిమాలన్నీ వాయిదాల బాట పడుతున్నాయి. ఇప్పటికే తమిళ్, మలయాళంలో కంప్లీటైన లాక్ డౌన్ లాస్ట్ ఇయర్, పెట్ డి-టె-క్టివ్ ఈ ఏడాది ఫస్ట్ ఆఫ్‌లో థియేటర్లలో హాయ్ చెప్పాల్సి ఉండగా రిలీజ్ డిలే అవుతున్నాయి. టాలీవుడ ఫిల్మ్ పరదా కూడా ప్రవీణ్ కండ్రేగుల శుభం ప్రాజెక్టుపై ఫోకస్ చేయడంతో పోస్ట్ పోన్ అవుతూ ఎట్టకేలకు ఆగస్టు 22న డేట్ లాక్ చేసుకుంది. పరదా బైలింగ్వల్ మూవీగా రాబోతుంది. ఇటు- తెలుగు, అటు- మలయాళంలో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. నెక్స్ట్ త్రీ మంత్స్‌లో త్రీ ఇండస్ట్రీల్లో అనుపమ సందడి చేయనుంది. పరదాతో పాటు- తమిళ పడమ్ బైసన్ రాబోతుంది. మారి సెల్వరాజ్ స్పోర్ట్ డ్రామాలో విక్రమ్ సన్ ధ్రువ్ విక్రమ్ హీరో. అక్టోబర్ 17పై ఇప్పటికే కర్చీఫ్ వేసుకుంది ఈ సినిమా. ఇదే కాకుండా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో చేస్తున్న కిష్కిందపురి కూడా అదే నెలలో తీసుకు రానున్నారని టాక్. అనేక వాయిదాల అనంతరం బ్యాక్ టు- బ్యాక్ సినిమాలతో వస్తోంది అనుపమ.




# విడుదలకు సిద్ధమవుతున్న అఖండ-2

నందమూరి నటసింహం బాలకృష్ణ- మాస్ డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'అఖండ 2' పై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. సింహ, లెజెండ్, అఖండ వంటి ఘన విజయాల తర్వాత ఈ జోడీ మరోసారి స్క్రీన్ మీద అదరగొట్టేందుకు సిద్ధమవుతోంది. అఖండ 2 చిత్రం 2021లో వచ్చిన బ్లాక్ బస్టర్ 'అఖండ' కు సీక్వెల్ కావడం విశేషం. ఆ చిత్రంలో బాలయ్య పోషించిన అఘోర పాత్ర, బోయపాటి మాస్ మేకింగ్, తమన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఆ ఫార్ములాను మరింత పవర్‌ఫుల్‌గా స్క్రీన్ మీదకి తీసుకురావాలని బోయపాటి తెగ కష్టపడుతున్నారు. ఈ భారీ పాన్ ఇండియా మూవీలో ప్రగ్యా జైశ్వాల్, సంజయ్ దత్, ఆది పినిశెట్టి, సంయుక్త మీనన్, జగపతిబాబు, హర్షాలీ మల్హోత్రా వంటి తారాగణం కనిపించనున్నారు.



# కాంతారా నుంచి కనకవతి పరిచయం


కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. 2022లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా వస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఈ సినిమాలో నటిస్తున్న కథానాయక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేశారు మేకర్స్. రుక్మిణి వసంత్ ఇందులో కనకవతిగా కనిపించబోతున్నట్లు- ప్రకటించారు. బాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు- తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లిష్ భాషల్లో విడుదల చేయనున్నారు.



# వార్-2.. కూలీపై సర్వత్రా ఆసక్తి

## హీరోల ఎంట్రీపై ఉత్కంఠ కలిగించేలా మేకింగ్

ఎన్టీఆర్ వార్-2. రజనీకాంత్ కూలీ చిత్రాలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండూపోటీగా విడుదలవుతున్నాయి. సినిమా స్టార్ కాగానే హీరో కనిపించే విధానానికి చెక్ పెట్టేస్తున్నారు మేకర్స్. గతంలో ఓ స్పెషల్ సాంగ్ లేదా ఓ చిన్న ఎలివేషన్లతో హీరో ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మినిమం అరగంట గ్యాప్ ఉండాల్సిందే. ఈ మధ్య సలార్, కల్కిలో అరగంట తర్వాతే యంగ్ రెబల్ స్టార్ దర్శన భాగ్యం లభించింది.. జస్ట్ కటౌట్ కనిపిస్తే చాలు అనుకుంటు-న్న ఫ్యాన్స్. ఈ గ్యాప్ పెద్దగా లెక్క చేయడం లేదు. ఇప్పుడు కూలీ, వార్ 2లో రజనీకాంత్, జూనియర్ ఎంట్రీ- కూడా ఇలాగే ఎ÷-లాన్ చేసినట్లు- టాక్ నడుస్తోంది. కూలీలో రజనీకాంత్ స్క్రీన్ పై కనిపించేంది మూవీ స్టార్ట్ అయిన గంట తర్వాత అన్నది బజ్ నడుస్తోంది. ఈ గంటలోనే మిగిలిన క్యారెక్టర్లన్నింటినీ చూపించబోతున్నాడట లోకేశ్ కనగరాజ్. అటు- బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమౌతున్న తారక్ కూడా - టైటిల్ కార్డ్స్ పడిన అరగంట తర్వాతే కనిపించబోతున్నాడట. వార్ 2లో హృతిక్- తారక్ ఫేస్ ఆఫ్ అండ్ సాంగ్ స్క్రీన్ తగలబడి పోతాయంటున్నారు బాలీవుడ్ క్రిటిక్స్. ఇలా హీరోలను సినిమా స్టార్టయిన అరగంటకు, గంటకు చూపించి ప్రేక్షకుడికి అ-టె-న్షన్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. ఏదేమైనా తమ ఫేవరేట్ హీరోల కోసం ఎంత సేపైనా వెయిట్ చేసేందుకు రెడీగానే ఉన్నారు డై హార్ట్ ఫ్యాన్స్. రెండు హై ఆక్టేన్ మూవీస్ కూలీ, వార్ 2 బాక్సాఫీస్ దగ్గర బిగ్గెస్ట్ వార్‌కు రెడీ అవుతున్నాయి. రెండూ తెలుగు సినిమాలు కాదు కానీ అలా అని పొరుగు సినిమాలనీ తీసేయలేం. ఎందుకంటే ఇద్దరు టాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్ హీరోలు నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాల్లో భాగం కాబోతున్నారు. సో మన సినిమాలుగా రిసీవ్ చేసుకుంటున్నారు టాలీవుడ్ ఆడియన్స్. మరి ఆగస్టు 14న ఏ సినిమా హిట్ టాక్ తెచుకుంటుందో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సౌండ్ చేస్తుందో లెట్స్ వెయిట్.



# బుల్లితెరకు స్మృతి రీ ఎంట్రీ

## ఒక్కో ఎపిసోడ్‌కు 14 లక్షల భారీ పారితోషికం



కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ నటి స్మృతి ఇరానీ ప్రస్తుతం ప్రధాన పాత్రలో నటిస్తున్న హిట్ ధారావాహిక 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2' తో బుల్లితెరపై రీ ఎంట్రీ ఇచ్చారు. ఈ సీరియల్ కోసం ఆమె ఒక్కో ఎపిసోడ్‌కు రూ.14 లక్షల వరకు పారితోషికం తీసుకున్నట్లు వార్తలు ఇటీవల వైరల్ అయ్యాయి. అయితే ఇప్పటికే ఈ విషయంపై సోషల్ మీడియాలో చర్చలు జరగడంతో, స్మృతి ఇరానీ ఈ రెమ్యునరేషన్ గురించి ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. నేనే బుల్లితెరలో అందరికంటే ఎక్కువ పారితోషికం పొందుతున్న నటిని. గతంలో ఈ సీరియల్ ప్రేక్షకాదరణతో పాటు- రేటింగ్ పరంగానూ టాప్ స్థాయిలో ఉండేది. అలాంటప్పుడు నటీ-నటు-లకు కావలసిన మేర పారితోషికం అందించడం సహజం. మేము కాంట్రాక్టర్లతో మాట్లాడుకోని ఒప్పందాలు చేసుకుంటాం. నేను యూనియన్ సభ్యురాలిని కాబట్టి, నాకు కూడా ఒక నంబర్ ఉంటుంది. దాని ఆధారంగా పారితోషికం తీసుకుంటాను. నేను ఇతర నటీనటులను ఓడించానని చెప్పవచ్చు. అందుకే నన్ను చూసి చాలా మంది స్ఫూర్తి పొందుతారు. ఇది కేవలం నటన మాత్రమే కాదు, ఓ బాధ్యత కూడా' అని తెలిపింది. కానీ ఎంత తీసుకుంటుందో నెంబర్ మాత్రం చెప్పలేదు.దాదాపు 25 సంవత్సరాల క్రితం 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ' ధారావాహికలో తులసి పాత్ర ద్వారా స్మృతి ఇరానీ పాపులారిటీని అందుకున్నారు. 2000 జూలైలో ప్రారంభమైన ఈ సీరియల్ 2008 నవంబరు వరకూ విజయవంతంగా ప్రసారం అయింది. ఆ సమయంలో స్మృతి ఇరానీ తులసి పాత్రకు పలు అవార్డులు, విశేషాలాభాలు దక్కించుకున్నారు. ఇక ఇప్పుడు అదే సీరియల్‌కు రెండో భాగంగా 'క్యోంకీ సాస్ భీ కభీ బహు థీ 2' జియో సినిమా, స్టార్‌ప్లస్ ఛానెల్లలో ప్రసారం అవుతోంది. ఇక ఈ భారీ పారితోషికంతో స్మృతి ఇరానీ బుల్లితెరపై తన కీ రీ ఎంట్రీ-ని ఘనంగా సెలబ్రేట్ చేస్తున్నారు. అభిమానులు కూడా ఈ సీరియల్‌కు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# సుధీర్ బాబు జటాధార

'జటాధర'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు సుధీర్‌బాబు . ఆయన హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రానుంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. సోనాక్షి సిన్హా కథానాయిక. తాజాగా ఈ సినిమా టీ-జర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. ఇందులో సోనాక్షి పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. దురాశకు, త్యాగానికి మధ్య జరిగే పోరాటాన్ని చూసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని చిత్రబృందం పేర్కొంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com